01ATP22_01ATP22.qxd 22-06-2023 PM 10:40 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 23 జూన్ 2023 పేజీలు : 04

# నాసిన్ కంపెనీని పరిశీలించిన కేంద్ర మంత్రి దేవాన్ష్ చౌహాన్




కేంద్ర మంత్రిని ఆహ్వానిస్తున్న దృశ్యం, నాసిక్ కంపెనీ నమూనాను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

**గోరంట్ల,జూన్ 22,ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాలసముద్రం వద్ద ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నాసిన్ కంపెనీని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఆదేశాల మేరకు కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి దేవాన్ష్ చౌహాన్ స్థానిక బీజేపీ నాయకులు జాతీయ కార్యదర్శి సునీల్ దేవర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి,జిల్లా ఆధ్యక్షుడు వజ్ర భాస్కర్‌రెడ్డి,కేంద్ర సెన్సార్ సభ్యులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెనుకొండ నియోజకవర్గ ఇంచార్జ్ జి.ఎం.శేఖర్ మరియు జిల్లా అధికారులతో కలసి సందర్శించి,కంపెనీకి సంబంధించిన ఇంజనీర్లు,కాంట్రాక్టర్లతో ఆధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నిర్మణ దశలో ఉన్న పనులను,పనితీరును ఇంజనీర్లతో అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ కంపెనీ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని,నాసిన్ కంపెనీ పూర్తి అయితే నిరుద్యోగులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెండుగా లబిస్తాయాని,కరువు జిల్లా అయిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇలాంటి కంపెనీలు రాదడం చాలా సంతోషంగా ఉందని,నురుద్యోగులకు ఉద్యోగ,ఉపాధి కల్పనే మన భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ధ్యేయం అని,నాసిన్ కంపెనీ దేశానికి వెన్నెముక లాంటిదని కేంద్ర మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో యువ మోర్చా జనరల్ సెక్రెటరీ మెంట వంశీకృష్ణ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉత్తమ్ రెడ్డి,పెనుకొండ నియోజకవర్గం అసెంబ్లి కన్వీనర్ మేదర శ్రీనివాసులు,సబ్ కలెక్టర్ కార్తిక్,ఆర్డిఓ భాగ్యరేఖ,గోరంట్ల తహశీల్దార్ రంగనాయకులు, సోమందేపల్లి తహశీల్దార్ సురేష్ మరియు నాసిక్ కంపెనీ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామంలోనూ కోపరేటివ్ సొసైటీ ఉండాలి

- సొసైటీలను బలోపేతం చేయాలి - ఎంపిఎఫ్‌సి గోడౌన్ల నిర్మాణం వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి



కార్యక్రమానికి హాజరైన డిసిఓ ప్రభాకర్‌రెడ్డి, ఫిషరీస్ డిప్యూటీ డైరెక్టర్‌శాంతి, పిఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రహ్మణ్యం, డిపిఓ ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

**అనంతపురం, జూన్ 22 ప్రభాతవార్త బ్యూరో**

జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ కోపరేటివ్ సొసైటీలు ఏర్పాటు చేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా కోపరేటివ్ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టరేట్ కేతన్‌గార్గ్‌తో కిలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాల్లో సొసైటీలు ఏర్పాటు అయ్యాయా లేదా చూడాలని, ఏర్పాటు కాని గ్రామాల్లో సొసైటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవా లన్నారు. ఇప్పటికీ ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సొసైటీలను బలోపేతం చేయాలన్నారు. సొసైటీ అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేలా చూడాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కూడా ప్రతి గ్రామంలోనూ ఉండేలా చూడాలన్నారు. ఎంపిఎఫ్‌సి (మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) గోడౌన్‌లకు సంబంధించి జిల్లాలో మొదటి దశలో 84 ఎంపిఎఫ్‌సి గోడౌన్లు మంజూరయ్యాయని, వాటిలో ఇప్పటి వరకు మూడు మాత్రమే పూర్తయ్యాయని, గోడౌన్ల నిర్మాణంచాలా నిదానంగా ఉందని, వెంటనే వేగవంతం చేసి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. రెండవ విడత ఎంపిఎఫ్‌సి గోడౌన్‌లకు సంబంధించి టెండర్లు పిలిచారని, త్వరలో నిర్మాణాల ప్రక్రియ చేపట్టాల న్నారు. ఈ సమావేశంలో డిసిఓ ప్రభాకర్‌రెడ్డి, ఫిషరీస్ డిప్యూటీ డైరెక్టర్‌శాంతి, పిఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రహ్మణ్యం, డిపిఓ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణాలు పూర్తయ్యేది ఎన్నడో..!

- నాలుగేళ్లుగా కొనసాగుతున్న సచివాలయాలు, ఆర్బీకేలు, వై.ఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణాలు
- ఉరవకొండ మండలంలోని 18 సచివాలయాలకు పదింటి నిర్మాణాలు మాత్రమే పూర్తి
- 13 ఆర్బీకేలకు ఒకటి మాత్రమే పూర్తికాగా కొనసాగుతున్న 12 వైఎస్ఆర్‌హెచ్‌సీల నిర్మాణం
- ప్రభుత్వ పాతభవనాలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న సచివాలయాలు, ఆర్బీకేలు
- నిర్మాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్న బిల్లుల చెల్లింపులో ప్రభుత్వ జాప్యం





నిర్మాణం ఆగిపోవడంతో 5వ సచివాలయం చుట్టూ ముళ్లచెట్లు ఏపుగా పెరిగినపోయిన దృశ్యం ,నిర్మాణాలు ఆగిపోయిన రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్ దృశ్యాలు

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణాలు ప్రారంభమై నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ కొనసాగుతున్నాయి. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం వీటి నిర్మాణాలు చేపట్టగా చేసిన పనులకు సంబంధించి భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులో చేస్తున్న జాప్యం కారణంగానే ఈ పరిస్థితులు నెలకొన్నాయని స్పష్టమౌతోంది. తాము వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ పనులు చేస్తుంటే నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు రావడంలేదని పలువురు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే...ఉరవకొండ మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రభుత్వం 18 సచివాలయాలు, 13 రైతు భరోసా కేంద్రాలు, 12 వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను మంజూరు చేసింది. వాటిలో ఇప్పటివరకు 10 సచివాలయాల నిర్మాణం పూర్తి కాగా కేవలం ఒక్క రైతు భరోసా కేంద్రం నిర్మాణం మాత్రమే పూర్తి అయింది. వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణాలు మాత్రం వివిధ దశల్లో ఉన్నాయి. ఆమిద్యాలలో 1,2, బూదగవి, లత్తవరం, మోపిడి, నెరమెట్ల, నింబగల్లు, రాకెట్ల, రాయంపల్లి, వెలిగొండ గ్రామాల్లోని సచివాలయాల నిర్మాణం పూర్తి అయ్యాయి. చిన్నముష్టూరు, షేక్షానుపల్లిలో కోర్టు కేసుల కారణంగా నిర్మాణాలు బేస్‌మట్టం స్థాయిలోనే ఆగిపోయాయి. పెద్ద కౌకుంట్ల పంచాయతీ విషయానికొస్తే కోర్టు కేసుల కారణంగా సచివాలయం-2 నిర్మాణం ప్రారంభానికే నోచుకోకపోగా సచివాలయం-1 నిర్మాణం బిలో బేస్‌మట్టం స్థాయిలోనే నిలిచిపోయింది. ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలో ఉరవకొండ-2,4 సచివాలయాలు ఫినిషింగ్ స్థాయిలో ఉండగా, ఉరవకొండ-3,5 సచివాలయాల నిర్మాణం వివిధ దశల్లో ఆగిపోయింది. రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) విషయానికొస్తే వెలిగొండలో మాత్రమే నిర్మాణం పూర్తి అయింది. మోపిడి, లత్తవరం, రాయంపల్లి, చిన్నముష్టూరు నిర్మాణాలు ఫినిషింగ్ స్థాయిలో ఉండగా, నెరమెట్ల, ఉరవకొండ-5 నిర్మాణాలు రూఫ్ లెవెల్‌లో ఉన్నాయి. ఆమిద్యాల-2, నింగబల్లు, రాకెట్ల, షేక్షానుపల్లి నిర్మాణాలు బేస్‌మట్టం స్థాయిలోనే ఉన్నాయి. కోర్టు కేసుల కారణంగా పెద్దకౌకుంట్ల-1 నిర్మాణం బిలో బేస్‌మట్టం, షేక్షానుపల్లిలో బేస్‌మట్టం స్థాయిలోనే ఆగిపోయాయి. వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌ల విషయానికొస్తే వెలిగొండ, మోపిడి, నెరమెట్లలో నిర్మాణాలు పూర్తి కావస్తుండగా, చిన్నముష్టూరు, లత్తవరంలో రూఫ్ లెవెల్‌లోనూ, ఆమిద్యాల-2, బూదగవి, రాయంపల్లిలో బేస్‌మట్టం స్థాయిలో, షేక్షానుపల్లి, నింబగల్లులో బిలో బేస్‌మట్టం స్థాయిలో ఉన్నాయి. పెద్దకౌకుంట్లలో 1,2 నిర్మాణాలు స్థల సమస్య కారణంగా ప్రారంభం కాకపోవడం విశేషంగా చెప్పాలి.

**ఈ ఏడాది చివరిలోగా పూర్తికు చర్యలు :** నాలుగేళ్ళుగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు పూర్తి కాకపోవడంపై మండల ఇంజనీర్ (పంచాయతీరాజ్) మధుసూదన్‌రావును 'ప్రభాతవార్త' వివరణ కోరింది. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది చివరి నాటికి వాటి నిర్మాణాలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు.

# జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

**శ్రీసత్యసాయిజిల్లా, జూన్ 22, ప్రభాతవార్త ప్రభాతవార్త**

జగనన్న సురక్ష కార్యక్రమాని న్న విజయవంతం చేయాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మండల అధికారులు మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, తహశీల్దార్‌లు, సచివాలయాలు సిబ్బందితో జిల్లా కలెక్టర్, డిఆర్ఓ కొండయ్య, గ్రామ వార్డు వాలంటీర్ల నోడల్ అధికారి శివారెడ్డి, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులతో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంపొందించి, ప్రభుత్వం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడే లక్ష్యంతో జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ నెల 23న జగనన్న సురక్ష కార్యక్ర మాన్ని ప్రారంభించనునా న్నరని, మండల అధికారులచే వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, క్యాంప్ గురించి మరియు షెడ్యూల్ గురించి శిక్షణ కార్యక్ర మాలను పూర్తి చేసుకోవడం జరిగింద న్నారు. క్యాంపుకు ముందుగానే వాలంటీర్లు గృహ సరాథులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ పథకాలు మరియు ప్రభుత్వ పత్రాలకు సంబంధించిన సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కవాల్సిన పత్రాలను అప్పుడే సేకరిస్తారన్నారు. ఇంటిం టి సందర్శన మరియు క్యాంప్‌నిర్వహణపై ప్రభుత్వంలోని

మిగతా 3 లో

# ఏడాది పన్ను నేలాఖరులోపు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు

**అనంతపురం జూన్ 22 ప్రభాతవార్త**

నగర ప్రజలు 2023-24 సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్నును ఈ నెలాఖరులోపు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన దృశ్యం

# ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి

**అమరాపురం.జూన్ 22,ప్రభాతవార్త:**

మండల పరిధిలో హెమావతి గ్రామం నందు సిద్దలింగప్ప (65) పోలంలో ట్రాక్టర్ ద్వారా దున్నుతుండగా ప్రమాద వశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన సంఘటన చోటుచేసు కుంది.హెమావతి గ్రామానికి చెందిన యంజారప్ప పోలంలో ట్రాక్టర్ ద్వారా రోటర్ దున్నుతుండగా కింద పడి మృతి చెందినట్లు భార్య మంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చెస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# నేటి నుంచి కదిరిలో ప్రారంభం కానున్న టిడిపి బస్సు యాత్ర

- భవిష్యత్తుకు గ్యారెంటీ నినాదంతో ప్రచారం - నూతన ఉత్తేజంలో తెలుగు తమ్ముళ్లు
- హాజరుకానున్న రాయలసీమలోని సీనియర్ నేతలు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- బస్సు యాత్రను జయప్రదం చేయండి




భవిష్యత్తు గ్యారెంటీ చైతన్య రథం , టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్

**కదిరి, జూన్ 22 ప్రభాతవార్త**

రాజమహేంద్ర వరంలో గత నెలలో నిర్వహించిన మహానాడులో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన తొలి మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ సమాయత్తం అయింది. భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో చైతన్య రథయాత్ర శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లాలోని కదిరి నియోజకవర్గంలో ప్రారంభం కానుంది. రాయలసీమలోని అన్ని జిల్లాల నుంచి తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

**బస్సు యాత్ర షెడ్యూల్ :** భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో యాత్ర నిర్వహించే బస్సుకు శుక్రవారం కదిరి పట్టణంలోని శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం అక్కడి నుంచి బస్సు యాత్ర ప్రారంభం కానున్నట్లు తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు తెలిపారు. పట్టణంలో మక్కా అలాం ఖాన్, వలీ ధర్గా, రాయలసీమ సర్కిల్, టవర్‌క్లాక్, వేమారెడ్డి సర్కిల్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేసిన అనంతరం పుటాగుల, కదిరి కుంట్లపల్లి, తలుపుల మండలంలోని బత్రేపల్లి, తురకవాండ్లపల్లి, కొరుగుట్ల పల్లి, తలుపుల, కుమ్మరపేట దర్గా అనంతరం తలుపులలో బహిరంగ సభ అనంతరం ఉబ్బం వాండ్లపల్లి, నంగివాండ్లపల్లి, బండ్లపల్లి పంచాయితీలోని బిసి కాలనీల్లో వివిధ రకాల అంశాలపై స్థానికులతో సమావేశం పండ్ల వాండ్లపల్లి, నూతన కాలవలోని దళితులతో సమావేశం, టవటవారిపల్లి, ఓబులరెడ్డిపల్లి, పులిగుండ్లపల్లి, వెలిచల్మల, వీస్ట్ నడింపల్లి, గోపాలపురం, రామాపురం, గౌకన పేట, దినిమిందపల్లి, టిఎన్.పల్లి అనంతరం, జౌకులలో దూదేకుల కులస్తులతో ముఖాముఖి కార్యక్రమం. మరికుమ్మ దిన్ని అటవీ శాఖకు చెందిన భూ సమస్యలపై చర్చ. ఎన్‌పికుంట సోలార్, దనియాల చెరువు అనంతరం గాండ్లపెంట మండలంలోకి బస్సు యాత్ర ప్రవేశించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. మండలకేంద్రం నుంచి గజ్జల వారి పల్లి, తాండా, చామాలగుంది, గాండ్లపెంటలో బహిరంగ సభ అనంతరం కటారుపల్లి క్రాస్, కమతం పల్లి నుంచి కదిరి రూరల్ మండల పరిధిలోకి బస్సు యాత్ర ప్రవేశం కానున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. రూరల్ మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో స్థానికులతో సమావేశం అనంతరం కదిరి మున్సిపాలిటీ పరిధిలోకి బస్సు యాత్ర ప్రవేశించి టిబిఆర్ ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకోనున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు.

**రెండవ రజు షెడ్యూల్ :** శనివారం ఉదయం 9 గంటలకు టిబిఆర్ ఫంక్షన్ నుంచి బస్సు యాత్ర ప్రారంభమై పట్టణంలోని జివిమాన్ సర్కిల్‌లో బహిరంగ సభ అనంతరం కూరగాయల మార్కెట్, స్వర్ణకారులతో సమావేశం, కోనేరు పరిశీలన, గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల నిర్మాణాల పరిశీలన, అనంతరం కదిరి రూరల్ మండల పరిధిలోని అల్లిపూర్ తాండా, హంద్రీనీవా కాలువ పరిశీలన, వరిగిరెడ్డిపల్లి, కెవన్ పాళ్యం, యాకాల చెరువు పల్లి వరకు బస్సు యాత్ర కొనసాగనుంది. అనంతరం పుట్టపర్తి నియోజకవర్గంలోకి బస్సు యాత్ర ప్రవేశిస్తుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

**టిడిపి బస్సు యాత్రను జయప్రదం చేయండి : నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కందికుంట :** భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంతో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కదిరిలో నిర్వహిస్తున్న బస్సు యాత్రను పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి జయప్రదం చయోలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పిలుపునిచ్చారు.

**నూతన ఉత్తేజంలో తెలుగు తమ్ముళ్లు :** నియోజకవర్గంలో భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో బస్సు యాత్ర ప్రారంభం కావడంతో తెలుగు తమ్ముళ్లో నూతన ఉత్తేజం నెలకొంది. వైకాపా ప్రభుత్వ అరాచకాలను ఎండగడతామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన తొలి మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా సైనికుల్లా పని చేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

















02ATP27_02ATP27.qxd 22-06-2023 PM 10:42 Page 1



## చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి

**- ఉమామహేశ్వరనాయుడు**

కళ్యాణదుర్గం టౌన్, జూన్ 22 ప్రభాతవార్త



మాట్లాడుతున్న ఉమామహేశ్వరనాయుడు

ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని ఇంటికి పంపి అన్ని విధాలా దెబ్బతిన్న మన రాష్ట్రానికి అన్ని విధాలా ముందుకు తీసుకెళ్లడానికి చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకుందామని గురువారం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమామహేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గంలోని ఎన్టీఆర్‌భవన్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీపై నిర్వహిస్తున్న బస్సు యాత్రపై నిర్వహించిన సమీక్ష కార్యక్రమానికి అన్ని మండలాల నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమామహేశ్వరనాయుడు మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని విధాలా దెబ్బతిందని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు. వీటన్నింటినీ గ్రామీణ ప్రాంత ప్రజలకు వివరించడంతోపాటు మహానాడులో విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రచారం చేసేందుకు తలపెట్టిన బస్సు యాత్రను కలిసికట్టుగా నిర్వహించి విజయవంతం చేద్దామని కోరారు. రాష్ట్రంలోనే కాక కళ్యాణదుర్గం నియోజకవర్గంలో చోటు చేసుకున్న అనేక అవినీతి అక్రమాలను నాయకులకు కార్యకర్తలకు వివరిస్తూ వీటన్నింటిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు తలపెట్టినందుకు చేపడుతున్న 30 రోజుల బస్సు యాత్ర 150 రోజులపాటు నిర్వహిస్తున్న భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంతాలు తిరిగి వివరిద్దామని కోరారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కరించాలని ఎంపిడిఓ ఆఫీసు ముట్టడించిన మహిళలు



బిందెలతో నిరసన తెలియజేస్తున్న మహిళలు, తదితరులు

**శెట్టూరు, జూన్ 22 ప్రభాతవార్త :** గుక్కెడు నీళ్ల కోసం గుప్పెడు కష్టాలు నీటి సమస్య పరిష్కరించాలి మహాప్రభు అంటూ మహిళలు ఆందోళన చేపట్టారు. గత నెల రోజుల నుంచి మండలకేంద్రం లో సినిమా హాలు ఏరియాలో నీటి ఎద్దడి నెలకొంది. గత నెల రోజుల నుంచి గ్రామ సర్పంచు పంచాయితీ అధికారులకు అనేక సార్లు నీటి సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేద న్నారు. మహిళలు ఆవేదన చెందారు. విసుగు చెందిన మహిళలు గురువారం ఎంపిడిఓ కార్యాలయం ముట్టడించి ఆందోళన చేపట్టారు. మా ఏరియాకి నీటి సమస్య పరష్కరించేంత వరకు ఆందోళన చేపడుతామని అధికారులకు తెలియజేశారు. ఆఫీస్ చుట్టూ తిరిగినా కూడా అధికారులు మాత్రం నీటి సమస్య పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మహిళలు అధికారులపై మండి పడ్డారు. ఇంత నిర్లక్ష్యం ఉంటే సమస్యలు ఎవరు పరిష్కరిస్తారంటూ తమ గోడును మీడియా దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా అధికారులు గ్రామ సర్పంచు ప్రజా ప్రతినిధులు స్పందించి మాకు నీటి సమస్య పరిష్కారం చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉమా, రాజన్న, నాగరాజు, వన్నూరుస్వామి, వేదవతి, లక్కవ్వ, లతమ్మ, మహాలక్ష్మి, లలితమ్మ కళవతి, తదితరులు పాల్గొన్నారు.

## జయరాములు కుటుంబాన్ని పరామర్శించిన మాదినేని ఉమా



నివాళులు అర్పిస్తున్న మాదినేని ఉమామహేశ్వరనాయుడు



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం టౌన్, జూన్ 22 ప్రభాతవార్త** :మున్సిపాలిటీ పరిధిలోని గరీబ్ నగర్‌కు చెందిన నాయీబ్రాహ్మణ జయరాములు మృతి చెందడంతో విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ ఆయన మృతదేహానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా రూ.5వేలు ఆర్థిక సాయంగా అందించారు.

## చదువుకు పేదరికం అడ్డురాకూడదు

**- ఉపాధ్యాయులు బద్యేనాయక్**

**- కైరేవు పేద దళిత విద్యార్థికి రూ.25వేలు ఆర్థిక సాయం**



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

**శెట్టూరు, జూన్ 22 ప్రభాతవార్త :** విద్యతో కోటి దీపాలు వెలిగించవచ్చు అనే సంకల్పంతో తాను చదివేటప్పుడు పడ్డ ఇబ్బందులు ఏ విద్యార్థికి రాకూడదు అని నియోజకవర్గంలో విద్యార్థులకు నేనున్నానంటూ సాయం చేస్తూ ముందుకు సాగుతున్నారు ఉపాధ్యాయుడు బద్యేనాయక్, ఇందులో భాగంగానే కైరేవు గ్రామానికి చెందిన రత్నమ్మ, తిమ్మరాజుల కుమారుడు తిరువన్ గుంటూరులోని జివిఆర్ఎస్ కళాశాలలో డిప్లమో మూడవ ఏడాది చదువుతున్నాడు. కళాశాల ఫీజు రూ.25వేలు చెల్లించాలని కళాశాల సిబ్బంది సూచించడంతో నేడే చివరి తేది కావడంతో ఉపాధ్యాయుడు బద్యేనాయక్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఉపాధ్యాయుడు మానవత్వం చాటుకున్నారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదు అనే నినాదంతో నియోజకవర్గంలో ఏ విద్యార్థికి అవసరమైన తనకుతోచిన సాయం చేస్తున్నారు. నేడు తిరువన్‌కు వచ్చిన సమస్య విద్యార్థి దశలో బద్యేనాయక్‌కు కూడా అప్పటోల డిప్లమో చేసేటప్పుడు ట్రైనింగ్ కోసం 25వేలు అవసరం అయ్యింది. ఆ నాడు బద్యేనాయక్ తండ్రి ఎన్నో కష్టాలు పడ్డాడు. అదే గ్రామంలో రొట్టె రామలక్ష్మి అనే మహిళ సాయం చేయడంతో నేడు నేను ఉపాధ్యాయుడు అయ్యాయని గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఆరోజు మనసులో బలంగా సంకల్పం చేసుకున్నా అని నా పరిస్థితి ఏ విద్యార్థికి రాకూడదని నేను విద్యార్థుల చదువుకు నాకు వచ్చే జీతంలో పేద విద్యార్థులకు సాయం చేస్తున్నానన్నారు. అనంతరం తిరువన్ తల్లి దండ్రులు మాట్లాడుతూ..ఉపాధ్యాయుడు బద్యేనాయక్ నా కుమారుడు చదువుకి దేవుడిలాముందుకొచ్చి సమయానికి ఆర్థికసాయం అందించారన్నారు. దేవుడు మనిషిరూపంలో వచ్చి సాయం అందించారన్నారు. జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. అలాగే పేద విద్యార్థికి సాయం చేయడంపై దళిత కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## భైరవానితిప్ప సచివాలయంను తనిఖీ చేసిన ఎంపిడీఓ దాసానాయక్



సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడీఓ

**బ్రహ్మసముద్రం జూన్ 21 ప్రభాతవార్త, :** మండలంలోని భైరవానితిప్ప సచివాలయంను ఎంపిడీఓ దాసానాయక్ గురువారం తనికీ చేశారు సచివాలయ ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి ఉద్యోగులు ప్రతిరోజు సమయానికి బయోమెట్రిక్ వేయాలని అన్నారు.అర్హులైన లబ్దిదారులకు సంక్షేమఫలాలు అందిచడంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకొంటానని అన్నారు.గ్రామాలలో తాగునీటి వసతి ప్రభుత్వ భవనాల నిర్మాణం హౌసింగ్ పనుల పురోగతిని అడిగి తెలుకొన్నారు.

## జగనన్న సురక్షపై ప్రత్యేక శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**కంబదూరు, జూన్ 22, ప్రభాతవార్త:** మండల కేంద్రం లోని సచివాలయ రెండు పరిధిలో జటన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సెక్రెటరీ అనురాధ,ఏం ఎల్ ఓ హనుమంతరాయుడు ఆధ్వర్యంలో వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి మరోసారి ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి జగనన్న సురక్ష అనే కార్యక్రమం తీసుకోచ్చారని తెలిపారు.వాలంటీర్లు తమక్లస్టర్‌లోఉన్న సమస్యలనుతెలుసుకోవాలన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ శివలింగప్ప,డిజిటల్ అసిస్టెంట్ విశ్వనాథ్,సచివాలయ కన్వీనర్ కిరణ్ తదితర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్రను విజయవంతం చేయండి

**- గుండుమల తిప్పేస్వామి**



స్థల పరిశీలన చేస్తున్న గుండుమల తిప్పేస్వామి, తెదేపా నాయకులు

**గుడిబండ, జూన్ 22 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఈ నెల 26వ తేది సోమవారం జరిగే భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథ యాత్ర భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని గుడిబండ మండల తెలుగుదేశం పార్టీ నాయకులకు దిశ నిర్దేశం చేసిన మడకశిర నియోజకవర్గ తేదేపా ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి తెలుగుదేశ పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాళ్లపల్లి రిజర్వాయర్, అర్థాంతరంగా ఆగిపోయిన గురుకుల పాఠశాల, కళాశాలలభవనాలు పూర్తి కావాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని అప్పుడే బడుగుబలహీన వర్గాలవారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. తదనంతరం మండలంలో జరిగే బహిరంగ సభకు స్థలాలను పరిశీలించారు. అలాగే శంకరగల్లు రామన్న తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో తేదేపా మండల అధ్యక్షులు మద్దనకుంటప్ప, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, డాక్టర్ సెల్ అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, లాయర్ శివకుమార్, దుర్గేష్, రాజేంద్ర, బూదిపల్లి జయరాం, భోజరాజు, నజీర్, క్లస్టర్ ఇన్‌చార్జ్లు భీమరాజు, లక్ష్మినరసప్ప, యూనిట్ ఇన్‌చార్జ, బూత్ ఇన్‌చార్జ్, మాజీ సర్పంచులు,మాజీ ఎంపిటిసిలు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జగనన్న ఆణిముత్యాలుకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం



బహుమతులు అందజేస్తున్న సర్పంచు, హెచ్‌ఎం, స్కూల్ చైర్మన్

**కనగానపల్లి, జూన్ 22 ప్రభాతవార్త :** మామిళ్లపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గురువారం 2022-23 సంవత్సరం 10వ తరగతి పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన హై స్కూల్ విద్యార్థులు వంశీ, మొదటి బహుమతి 3వేలు, సాయి లక్ష్మి ద్వితీయ బహుమతి 2వేలు, శరన్‌కుమార్‌రెడ్డి, తృతీయ బహుమతి వెయ్యి రూపాయల నగదు బహుమతులు అందించారు. ఆ విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ చైర్మన్ గోసే శివయ్య, సర్పంచు ఓబిరెడ్డి, హెచ్ ఎం స్నేహలత, ఉపాధ్యాయులు, నాగేంద్రరెడ్డి, శివారెడ్డి, పిడి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష పతకంపై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

**గోరంట్ల,జూన్ 22,ప్రభాతవార్త:** జగనన్న సురక్ష పతకంపై మండల ప్రజా పరిషత్ కార్యలయంలో సత్య సాయి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ రంగనాయకులు, ఎంపిడిఓ కఘునాథ్ గుప్తాలతో పాటు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అంగన్ వాడి కేంద్రాన్ని తనిఖి చేసిన సిడిపిఓ



అంగన్వాడి సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖి చేసిన సిడిపిఓ శాంతిలక్ష్మి

**రొద్దం,జూన్ 22,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కోగిర గ్రామంలోని అంగన్ వాడి కేంద్రాన్ని సిడిపిఓ శాంతమ్మ తనిఖి చేయడం జరిగింది. అంగన్ వాడి కేంద్రంలో చిన్నారులకు ఆటా,పాటలు, విద్యా సక్రమంగా జరగాలని అంగన్ వాడి టిచర్లను హెచ్చరించారు.అదేవిధంగా మహిళలపై మరియు పిల్లలపై అఘాయిత్యాలు తలపెట్టేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించడమైనది.

## బస్సు యాత్రను విజయవంతం చేయండి

**- మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

**కొత్తచెరువు, జూన్ 22, ప్రభాతవార్త**

ఇటీవల మహానాడులో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించేందుకు బస్సు యాత్ర చేపట్టడం జరుగుతోందని, ఈ బస్సు యాత్రను తెదేపా శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన కొత్తచెరువులోని శ్రీవిద్య ఫంక్షన్ హాలు నందు తెదేపా నాయకులతో బస్సుయాత్రపై సమావేశం నిర్వహించారు. జూన్ 24 భవిష్యత్ గ్యారెంటి చైతన్య రథయాత్ర పుట్టపర్తి నియోజకవర్గంలోని బొగ్గులపల్లి నుండి ప్రారంభమౌతుందని, బుక్కపట్నం మీదుగా కొత్తచెరువుకు చేరుకొని ఇక్కడ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం అదే రోజు రాత్రి పల్లె నిద్రతో పుట్టపర్తిలో ముగుస్తుందన్నారు. గతంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను, మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు విరించడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడతారన్నారు. ఈ సమావేశంలో కన్వీనర్ శ్రీనివాసులు, భైరాపురం సర్పంచ్ రవికుమార్, కొత్తచెరువు మాజీ సర్పంచ్ వెంకటరమణప్ప, సామకోటి ఆదినారాయణ, బండ్లపల్లి మాజీ సర్పంచ్ కేశప్ప, వెంకటేష్, బండ్లపల్లి రాజు, శివ, షర్ఫొద్దీన్, గొడ్డాల్ హిదాయతుల్లా పాల్గొన్నారు.

## ఈనెల 30వ తేదీలోగా వడ్డీ లేకుండా ఆస్థిపన్నులను చెల్లించి సహకరించండి...

**- మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున**

**- త్రాగునీటిని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలి....**

**గుంతకల్లు, జూన్ 22 ప్రభాతవార్త**

గుంతకల్లు పురపాలక సంఘం పరిధిలోని ఆయా ఆస్థి పన్నులను సకాలంలో పన్నుల చెల్లింపులకు ఆయా యాజమాన్యం సహకరించాలని, పన్ను చెల్లింపులో భాగంగా (అపరాధ రుసుం) వడ్డీ లేమిగా ప్రభుత్వ ఆదేశాల ఉత్తర్వుల మేరకు నిర్ణీత గడువు ఈనెల 30వ తేదీలోగా చెల్లింపులకు అవకాశం ఉందని మున్సిపల్ కమీషనర్ వి.మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కారా ్యలయంలో ఆయన తెలిపిన వివరాల మేరకు... గుంతకల్లు పురపాలక సంఘం పట్టణ ప్రజలు ఆయా ఆస్థి పన్నుల చెల్లింపుల పట్ల అలసత్వం వీడాలని, సకాలంలో చెల్లించిన యెడల పట్టణ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు దోహదం కాగలదన్న సత్యాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఈ నెల 30వ తేదీలోగా వడ్డీ లేకుండా చెల్లించే అవకాశంను ఆయా యాజమాన్యం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలో కొళాయిల ద్వారా త్రాగునీటి పంపిణీలో జాప్యం అనివార్యమైందని, రాబోవు రోజుల్లో ఇలాంటి విపత్తులు తలెత్తకుండా పలు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల పట్ల తాము ప్రజల దాహార్తి తీర్చే దిశలో శుద్ధతతో కూడిన సురక్షిత నీరును అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితులలో మున్సిపాల్టీ కొళాయిల ద్వారా పంపిణీ చేస్తున్న మంచినీరు వాడుకలో వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి నాసిర్‌హుస్సేన్, ఆర్ఐ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జగన్న సురక్ష కార్యక్రమ సమావేశం

**రొద్దం,జూన్ 22,ప్రభాతవార్త:**

మండల పరిధిలోని మండల పరిషత్ కార్యలయంలో నేడే జగనన్న సురక్ష కార్యక్రమం గురించి సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది.ఈ కార్యక్రమంకు ఎంపీపీ,జడ్పిటిసిలు,సర్పంచ్‌లు మరియు ఇతర మండల నాయకులను ఆహ్వానించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు గృహ సారధులు ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా రొద్దం ఎంపిడిఓ పేర్కొన్నారు.

## పుట్టపర్తిలోఉచిత బలిజ వివాహ పరిచయ వేదిక

**పుట్టపర్తిరూరల్, జూన్ 21, ప్రభాతవార్త :** పుట్టపర్తి బలిజ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేది ఉచిత బలిజ వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేయడం జరిగిందని ఆ సంఘం నాయకులు తెలియజేశారు. కావున పెళ్లి కాని బలిజ కులానికి చెందిన యువతీ యువకులు ఆదివారం ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రి 5:00 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో పోస్టు కార్డు సైజు ఫోటోతో వారి వ్యక్తి గత వివరాల ధృవపత్రాలతో పాటు హాజరు కవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బలిజసంఘం నాయకులు తొట్లగంగాధర్, చిమిరాలసుధాకర్, చింతా దామోదర్, మల్లికార్జున, ఆంజనేయులు, రమణ, బొగ్గరం శ్రీనివాసులు, ముత్యాల మధు, లక్ష్మిపతి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ పార్టీ బలోపేతం కోసమే గ్రామాల పర్యటన

**- పాముదుర్తి ఇంద్రజిత్ రెడ్డి**

**కొత్తచెరువు,జూన్ 22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని భైరాపురం, యర్రపల్లి తదితర గ్రామాల్లో గురువారం పాముదుర్తి ఇంద్రజిత్ పర్యటించారు. ఆయా గ్రామాల్లో వైకాపా నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివంగత నేత మాజీ ఎమ్మెల్యే పాముదుర్తి రవీంద్ర రెడ్డి అభిమానులు, అనుచరుల సహకారంతో గ్రామాల్లో పర్యటించి వైఎస్ఆర్‌సిపిని బలోపేతం చేయడంకోసమే అధిష్టానం ఆదేశాల మేరకు పర్యటిస్తున్నట్లు తెలియజేశారు. 2024 ఎన్నికల్లో మరో మారు ముఖ్యమంత్రిగావై.ఎస్.జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవడం లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమం ఆయన వెంట పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనుమతులు లేని తరగతి గదులు సీజ్



నారాయణ పాఠశాలను సీజ్ చేస్తున్న దృశ్యం

**కొత్తచెరువు, జూన్ 22, ప్రభాతవార్త**

అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తుండ డం, పాఠశాలల్లో అధిక ఫీజులు వసూళ్ళు చేస్తుడ డం పట్ల విద్యార్థి సంఘాలు నిరసన వ్యక్తం చేస్తూ పలు విద్యార్థి సంఘాలు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేయడంతో జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రంగస్వామిస్పందించి మండల ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి వెంకటరమణనాయక్ పాఠశాలను పర్యవేక్షించి అక్కడ ఉన్న మౌళిక వసతులు, పూర్వ పాఠశాల తరగతులు, 8, 9 తరగతులకు అనుమతులు లేకుండానే తరగతులు నిర్వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం పాఠశాల అనుమతులు లేని తరగతి గదులను సీజ్ చేశారు.

## బస్సుల నిండా ఆమె ప్రయాణం... ఫుల్ రష్....

**- మహిళల ఉచిత ప్రయాణంతో కిటకిటలాడుతున్న కేఎస్ఆర్‌టీసీ బస్సులు - టికెట్ చెల్లించినా పురుషులకు దక్కని సీట్లు**



కర్ణాటకలో బస్సుల నిండా ప్రయాణిస్తున్న మహిళలు

**బళ్లారి, జూన్22, ప్రభాతవార్త ;** రాష్ట్ర ప్రభుత్వం శక్తియోజన కింద రాష్ట్రవ్యాప్తంగా కేఎస్ఆర్‌టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌలభ్యాన్ని జారీలోకి తీసుకొచ్చిన విషయం విధితమే. అయితే ఇది ప్రారంభమైన తొలి రోజు నుంచే మహిళామణులు పిల్లాపాపలతో బస్సుల నిండా ప్రయాణం చేస్తున్నారు. బృందాలు బృందాలుగా చేసుకొని కర్ణాటకలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్తున్న వారి సంఖ్య బళ్లారి, కురుగోడు, సిరుగుప్ప, సండూరు, కంప్లీ ఆర్టీసీ బస్సు డిపోల నుంచి దిననిత్యం వేలాది మంది మహిళలు బస్సుల్లో పుణ్యక్షేత్రాలైన ధర్మస్థల, కుక్కే సుబ్రహ్మణ్యం, ఉడిపి, మంగళూరు, శృంగేరి, మైసూరు చాముండేశ్వరి తదితర చోట్లకు వెళ్తున్నారు. గ్రామాల నుంచి విరివిగా మహిళలు, ప్రయాణాలు బస్సు ప్రయాణాలు సాగిస్తుండడం విశేషం కాగా, బస్సుల్లో డబ్బు చెల్లించి టికెట్లు పొందిన పురుషలకు సీట్లు దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో వారు కండక్టర్లతో గొడవలు పడుతున్న ఘటనలు జరుగుతున్నాయి. ప్రయాణిస్తున్న మహిళల్లోనే తలపడుతున్న ఘటనలు దిననిత్యం చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం బస్సుల్లో ఆమె ప్రయాణం ఫుల్ జోష్‌గా... ఫుల్ రష్‌గా సాగుతున్నాయి.

## నేటి నుంచి ముదుకన మదివె నాటక ప్రదర్శన



పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న శ్రీ కుమారేశ్వర నాటకసంఘం కళాకారుడు బి.కుమారస్వామి

**బళ్లారి, జూన్ 22, ప్రభాత వార్త ;** రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 15 వేలకు పైగా ప్రదర్శనలతో ఆకట్టుకున్న ఫ్యామిలీ, సామాజిక ఆధారిత హాస్య నాటకం ముదుకన మదివే (ముసలోడి పెళ్లి) శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి బళ్లారిలో నాటక ప్రదర్శన జరుగుతుందని చిత్రదుర్గ శ్రీ కుమారేశ్వర నాటకసంఘం యజమాని, కర్ణాటక ప్రముఖ నాటక కళాకారుడు బి.కుమారస్వామి తెలిపారు. స్థానిక బాలాంజనేయస్వామి దేవస్థానం సమీపంలో గల శరణసక్కరె కొరెడప్పచౌకి ఆవరణలో నాటక ప్రదర్శన వేదిక స్థలంలో పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన, మూడు నెలలపాటు ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు గంటలకు, సాయంత్రం 6 గంటలకు ఈ నాటక ప్రదర్శన జరుగుతుందని, కళాపోషకులు వీక్షించి ప్రోత్సహించాలని కోరారు. ఇదొక కుటుంబ ప్రధానమైన హాస్య నాటకమని, తమ నాటక బృందంతో 15 మంది కళాకారులు ఉంటారని, వీరిలో స్త్రీ పాత్రధారులుగా ఖ్యాతి చెందిన సుధామణి, రవికళ, పుష్ప, నళినీలు కూడా అభినయం చేస్తారని చెప్పారు. బెంగళూరుకు చెందిన సతీష్ సంగీత దర్శకత్వం వహించారు. నగర, పట్టణ ప్రాంతాలతో కూడిన జనంతో పాటు గ్రామాల ప్రజలు అత్యంత ఆసక్తితో ఈ ముదుకనమదివె నాటకం గురించి చర్చించుకుంటారని, ఎన్నిసార్లు చూసినా పదేపదే చూసేందుకు ఇష్టపడతారని తెలిపారు. స్కూళ్లు, కాలేజీల విద్యార్థులకు కూడా రంగస్థల కళల పట్ల ఆసక్తి కల్పించేందుకు ఆయా కాలేజీల యాజమాన్యాలతో చర్చించి ప్రేరేపణ కలిగించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాటక వీక్షణకు రూ.100 టికెట్ నిర్ణయించినట్లు, కళారాధకులు టికెట్ పొంది మరుగున పడిపోతున్న రంగస్థల కళలకు ప్రోత్సాహం ఇవ్వాలని గుబ్బీవీరన్న నాటక కంపెనీతో బళ్లారిలో అడుగుపెట్టిన తాను తమ నాటక సంఘం నుంచే బళ్లారికి వచ్చి ప్రదర్శనలు చేస్తుండడం ఆరోసారి తెలిపిన ఆయన, ముసురు శ్రీనివాస, మాస్టర్ హిరణ్ణయ్య, బెళగల్ వీరన్న, సుదర్శన్, సుభద్రమ్మ మన్సూర్‌లతో పాటు అనేక ప్రముఖ నటులు తమ సంఘం నాటకాల్లో నటించి పేరు, ప్రఖ్యాతలు పొందారన్నారు. బళ్లారి కళలకు పుట్టినిల్లు అని తెలిపిన ఆయన, తమ ముదికన మదివే నాటకం వీక్షించి మరొకసారి ప్రోత్సహిస్తారన్న విశ్వాసం తనకున్నదన్నారు. జిల్లా కళాకారుల సమాఖ్య సంచాలకుడు, అభినయ కళాకేంద్రం అధ్యక్షులు కె.జగదీశ్, నాటక కళాకారులు హాళకుంది భీమిరెడ్డి, జి.నాగన్నగౌడ, హెచ్.ఎం.చంద్రశేఖర్, హెచ్.తిప్పేస్వామి, కాశీంబాషా, కుమార్‌గౌడ, వసంతకుమార్, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## బళ్లారిలో విద్యుత్ ధరల పెంపును ఖండిస్తూ భారీ ర్యాలీ

**- హోటళ్లు, అంగళ్లు, ఫ్యాక్టరీలు బంద్ చేసి ప్రతిఘటనలో పాల్గొన్న వ్యాపారులు**



బళ్లారిలో ర్యాలీ జరుపుతున్న వ్యాపారులు

**బళ్లారి, జూన్22, ప్రభాతవార్త ;** రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ కర్ణాటక వాణిజ్య పారిశ్రామిక సంస్థ గురువారం పిలుపునిచ్చిన కర్ణాటక బంద్ బళ్లారి జిల్లా ఛేంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ నేతృత్వంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఉదయం 6 గంటల నుంచే తమ వ్యాపార సముదాయాలను, ఫ్యాక్టరీలను బంద్ చేసి స్థానిక మున్సిపల్ కాలేజీ మైదానానికి చేరుకొని సమావేశమై ప్రతిఘటన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో సుమారు 45 వ్యాపార సంఘ సంస్థలకు చెందిన 5 వేల మందికి పైగా ప్రదర్శనకారులు పాల్గొన్నారు. ర్యాలీ శాంతియుతంగా జరిపి జిల్లాధికారి కార్యాలయం వద్దకు చేరుకొని పెంచిన విద్యుత్ ధరలను తక్షణమే ప్రభుత్వం తగ్గించాలని నిరసన చేపట్టారు. జిల్లాధికారి ద్వారా ప్రభుత్వానికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. వ్యాపార కార్యకలాపాలు స్వయంగా బంద్ చేసి వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. స్కూళ్లు, కాలేజీలు, బస్సుల సంచారం యదావిధిగా నడిచాయి. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల కార్యకలాపాలు కొనసాగాయి. ప్రతిఘటనకు నేతృత్వం వహించిన జిల్లా ఛేంబర్ సంస్థ అధ్యక్షుడు సి.శ్రీనివాసరావు, గౌరవ కార్యదర్శి యశ్వంతరాజ్‌నాగిరెడ్డిలు రాయల సర్కిల్‌లో ప్రదర్శనకారుల్ని ఉద్దేశించి మాట్లాడారు. కర్ణాటకలో పరిశ్రమలు, వ్యాపారులు జీవనం సాగించాలంటే ప్రభుత్వం తక్షణమే పెంచిన విద్యుత్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పొరుగున గల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలను విద్యుత్ ధరలు తక్కువగా ఉన్నాయని, మానవ వనరులు కూడా చాలినంత స్థాయిలో సులభంగా లభిస్తున్నాయని, పరిశ్రమల ఉత్పాదన వ్యయం తగ్గుతున్నదని, పారిశ్రామికవేత్తలు వాణిజ్య వ్యాపారులు పోటీ ధరలతో ఉత్పత్తుల్ని విక్రయిస్తున్నారని, అయితే కర్ణాటకలో విద్యుత్ ధరల పెంపు కారణంగా ఉత్పాదన వ్యయం పెరిగి ఇక్కడి పారిశ్రామికవేత్తలు పోటీ ధరకు ఉత్పత్తుల్ని విక్రయించేందుకు సాధ్యపడడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిఘటన ర్యాలీ ప్రదర్శన బెంగళూరు రోడ్డు ద్వారా బ్రూస్పేట పోలీస్‌స్టేషన్ మీదుగా మోతీ సర్కిల్ చేరుకొని జిల్లాధికారి కార్యాలయం వరకు కొనసాగింది. ప్రతిఘటనలో హోటళ్లు, వివిధ వ్యాపార సంఘసంస్థలకు చెందిన కార్యకర్తలతో పాటు కోల్డ్‌స్టోరేజ్ అసోసియేషన్, ఏపీఎంసీ మర్చంట్స్ అసోసియేషన్, బళ్లారి జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్, జిల్లా కాటన్ అసోసియేషన్, స్పాంజ్ ఐరన్ అసోసియేషన్, కర్ణాటక ఇండస్ట్రియల్ అసోసియేషన్, హోల్‌సెల్ సీడ్స్ అసోసియేషన్ బళ్లారి బ్రాస్, కాపర్‌మెటల్ అసోసియేషన్, బళ్లారి ట్రాన్స్‌పోర్టు ఓనర్స్ అండ్ ఆపరేటర్స్ అసోసియేషన్, ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్స్ అండ్ మర్చంట్స్ అసోసియేషన్, స్మాల్‌స్కేల్ ఇండస్ట్రిస్ అసోసియేషన్, బళ్లారి ట్యాక్స్‌బార్ అసోసియేషన్, బళ్లారి కిరాణా అండ్ జనరల్‌మర్చంట్స్ అసోసియేషన్, బళ్లారి ఆటో మొబైల్ డీలర్ అసోసియేషన్, బళ్లార్ జిల్లా సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్, బళ్లారి రెడిమేడ్ హోసైరీస్ డీలర్స్ అసోసియేషన్, హోటల్ అండ్ బేకరీ యజమానుల సంఘం తదితర వ్యాపార, వాణిజ్య సంఘ సంస్థలకు చెందిన యజమానులు, వాటిలో పనిచేసే సిబ్బంది పాల్గొని జయప్రదం చేశారు.

03ATP22_03ATP22.qxd 22-06-2023 PM 11:20 Page 1



## బస్సుయాత్రను విజయవంతం చేయండి

### - మండల టిడిపి కన్వీనర్ శెట్టివారి జయచంద్ర



శెట్టివారి జయచంద్ర

ఓబుళదేవరచెరువు, జూన్ 22, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో చేసిన అభి వృద్ధి, అధికార పార్టీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియ చేసేందుకు " భవిష్యత్తుకు గ్యారెంటీ " పేరుతో చేపడు తున్న బస్సు యాత్రను విజయవ ంతం చేయా లని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ శెట్టి వారి జయచంద్ర పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లా డుతూ.. పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదేశాల మేరకు ఈ నెల 24 (శనివారం) నియోజ వకర్గం లోని నల్లమాడ మండలం బుగ్గలపల్లికి బస్సు యాత్ర ప్రవేశిస్తుంద న్నారు. బస్సు యాత్రలో ఉమ్మడి అన ంతపురం జిల్లాలోని ఎమ్మెల్యేలు, నియోజక వర్గ ఇన్‌చార్జ్‌లు పాల్గొంటు న్నారన్నారు. వైకాపా ప్రభుత్వ వైఫల్యా లను క్షేత్రస్థాయిలో ఎండగ డుతూనే అధికారంలోకి వస్తే ఎలాంటి కార్యక్రమాలు చేపడతామో ఈ బస్సు యాత్రలో నాయకులు ప్రజలకు వివరిస్తారన్నారు. ఈ యాత్రకు సంఘీభావంగా మండలం నుండి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంఘాలు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు.

## ఓడీచెరువు తహశీల్దార్‌గా రామనాథరెడ్డి



తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియచేస్తున్న రెవెన్యూ అధికారులు

ఓబుళదేవరచెరువు, జూన్ 22, ప్రభాతవార్త : ఓడీచెరువు తహ శీల్దార్‌గా వై రామనాథరెడ్డి గురు వారం బాధ్యతలు స్వీకరించా రు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ పరమైన సమస్యలను వేగవంతం గా పరిష్కరించేందుకు కృషి చేస్తా నన్నారు. ప్రజలు ఎటువంటి సమస్యననై నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌కు డిప్యూటి తహశీల్దార్ రెడ్డిశేఖర్, రీసర్వే డీటి జాకీర్, ఆర్ఐ నాగేంద్ర, వీఆర్ఓ లు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. రామనాథరెడ్డి ఉమ్మడి కర్నూలు జిల్లా నంద్యాలలో పనిచేస్తూ ఓడీచెరువుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కునుకుంట్ల శ్రీధర్ తులుపుల మండలానికి బదిలీ అయ్యారు.

## విద్యార్థులు లక్ష్యం నిర్ధేశించుకోవాలి



విద్యార్థులకు మెడల్స్‌ను అందజేస్తున్న దృశ్యం

నల్లమాడ, జూన్ 22 ప్రభాతవార్త,

ప్రభుత ్వ పాఠశాలల విద్యార్థు లు లక్ష్యం నిర్ధేంశించుకొని చదవా లని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మ న్న తెలిపారు. మండల పరిధి లోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలలో గురువారం జగనన్న ఆణిముత్యాల కార్యక్రమ ంలో భాగంగా 2023 విద్యాసం వత్సరం పరిక్షాఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అం దజేస్తున్న నగదుతో పాటు మెడల్స్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివే బదులు ఇష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించ్చు, అంతేకాకుండ నవ సమాజ సమాజ స్థాపన కోసం విద్యార్థులు కృషి చేస్తే ప్రగతి పథంలో ప్రయాణించ వచ్చన్నారు. ప్రస్తుతం విద్యావ్యవస్థలో అనేక సమూల మార్పులు వచ్చాయ ని, ఎన్ని మార్పులు వచ్చినా గురువులను గౌర వించలేని విద్యార్థులు వ్యర్థమ న్నారు. అప్పటి చదువులు నేటి చదువులకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యా ర్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయునికి గ్రామస్థులు ఘన సన్మానం



ఏంఈఓకు వినతీపత్రం అందజేస్తున్న గ్రామ ప్రజలు



ఉపాధ్యాయుడు మరళీధర్ రావు ను సన్మానిస్తున్న గ్రామ ప్రజలు

తనకల్లు, జూన్ 22, ప్రభాతవార్త:

మండల పరిధిలోని గేమేనాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో గత 8 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మురళీధర్‌రావు బదిలీ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్థులు ఎంఈఓ లలిత మ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు మురళీధర్‌రావును మళ్ళీ మా ఊరి పాఠశాలలోనే డిప్యూటేషన్ వేయాలని యంఈఓ లలితమ్మకు వినతీ పత్రం అందజేశారు. ఉపాధ్యాయుడు మురళీధర్‌రావు గేమేనాయక్ తండా లో విధులు నిర్వహిస్తున్నప్పటి నుండి పిల్లలు నాణ్యమైన విద్య,క్రమ శిక్షణ అందించారని అలాంటి ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తుండటం మాకు దురదృ ష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో గేమేనాయక్ తండా పంచాయతీ కార్యద ర్శి అంజినేయులు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ హర్ష, ఏఎన్‌యం మమత, అంగ న్‌వాడీ టీచర్స్ శివమ్మ, నిర్మల, ఉపాధ్యాయులు శివశంకర్ ప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జింక వెంటపడ్డ కుక్కలు - కాపాడిన గ్రామస్తులు



జింకను కాపాడిన అటవీశాఖఅధికారులు

యల్లనూరు, జూన్ 22, ప్రభాతవార్త

శనిగల గూడూరు ఎస్సీ కాలనీ వద్ద జింకదారి తప్పి వచ్చింది. అక్కడ ఉన్న కుక్కలు జింకను వెంటపడ్డాయి. దానిపై దాడి చే యడంతో స్థానికులు ఆ జింకను కాపాడారు. అనంతరం ఆ జింక ను యల్లనూరు వెటర్నరీ ఆసుప త్రికి తీసుకువచ్చారు. అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. అ టవీ అధికారులు ఆ జింకను వెటర్నరీ సిబ్బంది అనిల్‌చే ప్రథమ చికిత్స చేసి, అటవీ అధికారులు సుధాకర్, గయాజుద్దీ న్, ఎస్.ఐ. రామకృష్ణలు యల్లనూ రు ఫారెస్ట్‌లో వదిలారు. ఆ జింకకు ఎలాంటి ప్రాణాపాయం లేదని వారు తెలిపారు.

## మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

**యల్లనూరు, జూన్ 22, ప్రభాతవార్త** : మండలంలోని చిలమకూరు వద్ద ఉన ్న ఆదర్శపాఠశాలలోని 7,8,9, తరగతులలోని మిగిలిన సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రినిపాల్ వెంకటపతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థి యొక్క ఆధార్ కార్డు,కుల ధృవీకరణ పత్రం జిరాక్స్, పాస్‌పోర్టు ఫోటోను పాఠశాలలో అందజేయాలన్నారు. ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

## నల్లచెరువు నూతన తహసిల్ధార్‌గా రవికుమార్



నూతన తహసిల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది

**నల్లచెరువు, జూన్ 22, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాల యంలో గురువారం నూ తన తహసిల్దా ర్‌గా రవికుమార్ బాధ్యతలు చేపట్టా రు. తహసిల్దార్ రవికుమార్ కర్నూలు జిల్లా ఆవకు మండల నుండి నల్లచెరువు మండలం తహసిల్దార్‌గా బాధ్య తలు చేపట్టడం జరిగింది. ఈ సంద్భంగా తహసిల్దార్ రవికుమార్ మాట్లాడు తూ కార్యాలయ సిబ్బంది ప్రజలకు ఇబ్బందులకు గురి చేయకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, మండలంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యాలయ సిబ్బందితో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది పూలమాల లు, దుశ్శాలువలతో సన్మానించి స్వాగతం పలికారు.

## నూతన తహసిల్దార్‌గా జిపి శోభ సువర్ణమ్మ



నూతన తహసిల్దార్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటి తహసిల్దార్

**తనకల్లు, జూన్ 22, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తహస ీల్దార్ కార్యాలయం నందు గురు వారం నూతన తహసిల్దార్‌గా జిపి శోభ సువర్ణమ్మ పదవి బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భ ంగా నూతన తహసిల్దార్ తహసి ల్దార్ మాట్లాడుతూ నేను కర్నూలు జిల్లా నుండి సత్యసాయి జిల్లా తనకల్లు మండలంకు బదిలీపై వచ్చానన్నారు. ప్రజలందరికి అందుబాటులో ఉంటూ నా కర్తవ్యాన్ని నేను నెరవేరుస్తానని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యాలయ సిబ్బందితో పని చేయిస్తానని ఆమె తెలిపారు.

## నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

### - ఎఐఎస్ఎఫ్ నాయకులు





నారాయణ పాఠశాల ముందు ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**కదిరి, జూన్ 22 ప్రభాతవార్త** : విద్యార్థుల నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న నారా యణపాఠ శాలపై చర్యలు తీసుకో వాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లం రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని నారాయణ పాఠశాల వద్ద ధర్నా కార్యక్ర మం నిర్వహిం చారు. ఈ కార్యక్ర మంలో ఆయ న మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈఎంఐ ఇన్‌స్టాల్ మెం ట్ పద్ధతిలో ఫీజులను వసూలు చేస్తూ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పోరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్ర మాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవ న్, హేమంత్, సాయి, కిశోర్, సంతోష్, సుమంత్, తరుణ్, సందీప్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

మొదటి పేజీ తరువాయి...



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

ఎ ఫ్ ఓ ఎ, జె ని ఎ న్ నెట్‌వర్క్ ద్వారా పర్యవేక్షణ చేయనున్నారు. ఈ నెల 24 నుండి 30 వరకు వార్డు గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటింటికి వాలంటీర్లు వెళ్ళి వారికి ప్రభుత్వం నుండి ఎలాంటి సర్టిఫికెట్లు అవసరం ఉందో తెలుసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాలని, జులై 1 నుండి ఆగస్టు 1వ తేది వరకు ప్రతి వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో క్యాంపులు ఏర్పాటు చేయాలని, తహశీల్దార్లు, ఎంపిడిఓలను ఆదేశించారు. జగనన్న సురక్ష క్యాంపుల ద్వాఆర ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు (కుల, నివాస ధృవీకరణ,), ఆదాయ ధృవీకరణ పత్రం, జనన, మరణ ధృవీకరణ, మ్యూటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యూటేషన్ ఫర్ కరెక్షన్, వివాహ ధృవీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులో మెబైల్ నంబర్ అప్‌డేట్, కౌలుగుర్తింపు(సిసిఆర్‌సి), కొత్తరేషన్ కార్డు, లేదా రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు, సంబంధించి కుటుంబ వివారల్లో కొంత మంది సభ్యుల పేర్ల తొలగింపు లాంటి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి నరసయ్య, డిపిఓ విజయ్‌కుమార్, డిఎంహెచ్ఓ డా.ఎస్.వి.కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ డా.ఎం.టి.నాయక్, పట్టుపరిశ్రమ శాఖ జెడి పద్మమ్మ, డిపిఓ విజయ్‌కుమార్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రషీద్ ఖాన్, సర్వే అండ్‌ల్యాండ్ రికార్డ్స్ ఎడి రామకృష్ణ, ఎపిఎంఐపి పిడి సుదర్శన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, డ్వామా పిడి రామాంజినేయులు, సోషల్ వెల్ఫేర్ శివరంగ ప్రసాద్, బిసి వెల్ఫేర్ డిడి నిర్మల జ్యోతి, సివిల్ సప్లై డిఎం అశ్వర్థనారాయణ నాయక్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎస్.చాంద్ బాషా, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వైఎస్ఆర్ పశు బీమా పథకం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ జెడి డాక్టర్ ఎన్.శుభదాస్ తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించి కేంద్రాలలో మెరుగైన సేవలు అందించండి

### - కార్యకర్తలను ఆదేశించిన సిడిపిఓ



సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఓ సరస్వతి

బత్తలపల్లి, జూన్ 22 ప్రభాతవార్త : బత్తలపల్లి ఐసి డిఎస్ ప్రాజెక్టు పరిధి లోని అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాలకు నిర్ధే శించిన సమ యంపాలనను పాటిచడంతో పాటు కేంద్రాలకు వచ్చే వారికి మెరుగైన సేవలు అందించాలని సిడిపిఓ సరస్వతి ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాల యంలో తాడిమర్రి, మదిగుబ్బ మండలాల కార్యకర్తలకు ప్రాజెక్టు మీటింగు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యకర్త క్రమం తప్పక కేంద్రానికి రావాలన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన సమయం వరకు కేంద్రాలలో వుండాలన్నారు. చిన్నారులన ప్రత్యేక శ్రద్ధతో చూసుకోవా లన్నారు. కేంద్రాలకు వచ్చే గర్భవతులు, బాలింతలకు సరైన సూచనలు, సలహాలు అందివ్వాలన్నారు. అన్ని వయసుల పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. హైరిస్కు గర్భవతులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నా రు. కేంద్రాలలో న్యూట్రిషియన్ చార్టులు, టైమ్‌టేబుల్ డిస్ప్లే చేయాలన్నా రు. కేంద్రాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. ప్రభుత్వం నుండి అందే పాలు, గుడ్లు, బాలామృతం, వైఎస్ఆర్ కిట్లు అందివ్వాలన్నారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లులకు తగిన సూచనలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు చంద్రమ్మ, దేవమణి, లలితమ్మ, సీనియర్ అసిస్టెంటు శంకరమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## ఆవు కన్నుకు సోకిన కాన్సర్‌కు శస్త్ర చికిత్సలు

### - వైద్యులకు పలువురి అభినందనలు



శస్త్ర చికిత్స చేసిన ఆవుతో పశువైద్యులు

**బత్తలపల్లి, జూన్ 22 ప్రభాతవార్త** : క్యాన్సర్ వ్యాధి సోకి కన్ను దెబ్బతిన్న ఆవుకు పశువైద్యులు శస్త్ర చికిత్సలు చేసి కన్నును తొలగించారు. గురువారం బత్తలపల్లి పశు వైద్యశాల ఏడి శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని నల్లబోయనపల్లికి చెందిన శరత్ అనే రైతుకు చెందిన ఆవు కంటికి క్యాన్సర్ సోకడంతో కన్ను పోయిందన్నారు. రైతు 1962కు ఫోన్ చేయడంతో అంబులెన్స్ గ్రామానికి వెళ్లి ఆవును బత్తలపల్లి పశువైద్యశాలకు తీసుకు రాగా, అక్కడ అంబులెన్స్ పశువైద్యురాలు దివ్య, కాంపౌండర్ సాయినాథ్‌ల సహాయంతో ఆవు కన్నుకు శస్త్ర చికిత్సలు చేసి అవసరమైన మందులు వేయడం జరిగిందన్నారు. మరో 5రోజుల పాటు ఆవును జాగ్రత్తగా చూసుకోవాలని రైతుకు తెలిపి తిరిగి అంబులెన్స్‌లో గ్రామంలోని రైతు ఇంటికి చేర్చడం జరిగిందన్నారు. రైతులు ఎవరైనా తమ పశువులకు అనారోగ్యం సోకితే అంబులెన్స్‌కు ఫోన్ చేసి వైద్య సేవలు పొందాలని ఆయన కోరారు. ఆవు కంటికి కాన్సర్ సోకడంతో శస్త్ర చికిత్సలు చేసి ఆవు పడుతున్న బాధకు ఉపశమనం కలిగించిన వైద్యులను పలువురు రైతులు, ప్రజలు అభినందించారు.

## బత్తలపల్లి ఎంపిడిఓగా సౌజన్యకుమారి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎండిడిఓ సౌజన్యకుమారి

**బత్తలపల్లి, జూన్ 22 ప్రభాతవార్త** : మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా సౌజన్యకుమారి బాధ్యతలు స్వీకరిం చారు. గురువారం ఆమె ఎంపిడిఓ కార్యా లయంలో సూపరిం డెంట్ శ్రీదేవితో బాధ్యతలు స్వీకరించారు. ధర్మవరం ఎంపిడిఓగా వున్న ఆమె బత్తలపల్లి ఇంచార్జ్ ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపిడిఓగా వున్న సాయిమనోహర్ శిక్షణ నిమిత్తం వెళ్లడంతో ఎంపిడిఓగా ఇంచార్జ్‌ను సౌజన్యకుమారికి అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. మండల అభివృద్ధికి కలసి పనిచేయలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీదేవి, సిఎస్‌డిటి దివాకర్, మల్లిఖార్జున, చిన్నసూరి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, ఏపిఓ ఆదెప్ప, కార్యదర్శులు తదితరులు వున్నారు.

## బస్సు యాత్రను జయప్రదం చేయండి

**అగళి, జూన్ 22 ప్రభాతవార్త** : ఈ నెల 26వ తేదిన జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చేపట్టబోయే బస్సు యాత్రను విజయవంతం చేయాలని జడ్పిటిసి ఉమేష్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, కన్వీనర్ కుమారస్వామి తెలిపారు. 23వ తేది శుక్రవారం బస్సు యాత్రపై అగళి మండలంలోని పుష్పాంజలి థియేటర్‌లో 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మడకశిర తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ గుండుమల హాజరు అవుతారని తెలిపారు. తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జోనల్ ఇన్‌చార్జ్ అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, జిల్లా టిడిపి అధ్యక్షులు పార్థసారధి, శ్రీరామ్, సత్యసాయి జిల్లా నాయకులు ఈ బస్సుయాత్రలో చంద్రబాబునాయుడు వెంట పాల్గొంటారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దీనికోసమే శుక్రవారం అగళిలో ఆ మండలానికి సంబంధించిన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని తెలిపా రు. భవిష్యత్తుగ్యారెంటీ చైతన్యరథయాత్రను విజయవంతం చేయాలన్నారు.

## ఇళ్లుమంజూరు అయిన వారి ఇంటింటికీ వెళ్తున్నాం..

### - స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్



విలేకర్లతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

**అగళి, జూన్ 22 ప్రభాతవార్త** : మండలానికి నూతనంగా ఇళ్ల మంజూరు అయిన లబ్ధిదారుల ఇంటి దగ్గరకు వెళ్లి ఇళ్లు నిర్మిం చుకోవాలని అవగాహన కల్పిస్తున్నట్లు ప్రత్యేక అధికారి, జిల్లా హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్, ఎంపిడిఓ నరేంద్రకుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రైమినిస్టర్ ఆవాస్ యోజన గ్రామీన్ కింద అగళి మండలా నికి 236 ఇళ్లు మంజూరు అయ్యాయని వాటిని సత్వరమే నిర్మించుకోవాలని తెలిపారు. 1.80లక్షలు ఒక్కో ఇంటి నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. పునాది నిర్మించుకుంటే సత్వరమే 40వేల రూపాయలను లబ్ధిదారుల ఖాతాలకు జమచేస్తామన్నారు. అనంతరం ప్రత్యేకఅధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జగనన్న సురక్ష పథకంపై ప్రత్యేకంగా 1వ తేది నుంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయాల ద్వారా ప్రజలకు చేరాల్సిన సేవలను గురించి వివరిస్తామన్నారు. వీరి వెంట హౌసింగ్ ఏఈ అరుణ్‌కుమార్ అన్నారు.

## నూతన తహశీల్దారుగా జమానుల్లా ఖాన్



**అగళి,జూన్ 22 ప్రభాతవార్త** : మండల తహ శీల్దారుగా జమానుల్లాఖాన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పదోన్నతిపై కంబదూరు నుంచి అగళి తహశీల్దారుగావచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భం గా నూతనతహశీల్దారు మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులోఉండి సేవలు అందిస్తా నని తెలిపారు. వీరి వెంట డిప్యూటీ తహశీల్దారు సుబ్బారావు, ఆర్ఐ గుర్రన్న, వీఆర్ఓలు ఉన్నారు.

## ఉరవకొండ మండలానికి రెగ్యూలర్ తహశీల్దార్‌ను నియమించరా..?!

### - ఏడాది కాలంగా కొనసాగుతున్న ఇంచార్జ్ తహశీల్దార్ల పాలన
### - కేవలం ఏడాదిలోపే మారిన ముగ్గురు ఇంచార్జ్ తహశీల్దార్లు
### - ఉరవకొండ అంటేనే మేము చేయలేమని చేతులెత్తేస్తున్న తహశీల్దార్లు





తహశీల్దార్లు ఎవరెవరూ ఎంతకాలం ఇక్కడ పనిచేశారో తెలియజేసే బోర్డు

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త** : ఉరవకొండ మండలానికి రెగ్యూలర్ తహశీల్దార్ ను నియమించకపోవడం విమర్శలకు తావిస్తోం ది. నియోజకవర్గానికి ఉరవకొండ మండలం కీలకం కాగా దాదాపు ఏడాది కాలంగా ఇంచార్జ్ తహశీలా ్దర్లతోనే జిల్లా అధికారులు కాలం వెల్ల బుచ్చుతుండటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రెగ్యూలర్ తహశీల్దార్‌గా 2020 అక్టోబర్ 6న సి.మునివేలు బాధ్యతలు చేపట్టి 2022 జూలై 10 వరకు పనిచేయగా వివిధ రాజకీయ కారణాలతో అర్ధాంతరంగా తాడిపత్రికి బదిలీ అయ్యారు. నాటి నుండి మండలానికి ఇంచార్జ్ తహశీల్దార్ల పాలన ప్రారం భమైంది. విడపనకల్లు తహశీల్దార్‌గా ఉన్న బి.బ్రహ్మయ్య 2022 జూలై 18న ఉరవకొండ మండల తహశీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టగా ఫిబ్రవరి 3 వరకు పనిచేశారు. అదే రోజు కణేకల్లు మండలం సీఎస్‌డీటీగావున్న సయ్యద్ షాబుద్దీన్ మండల తహశీల్దార్‌గా ఎఫ్ఏసీ బాధ్యతలు చేపట్టారు. ఈక్రమంలోనే ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనకు పదోన్నతి లభించగా సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండల తహశీల్దార్‌గా నియమించగా ఆయన ఈనెల 16వ తేదీన ఇక్కడి నుండి రిలీవ్ అయ్యారు. మండలానికి కొత్త తహశీల్దార్ వస్తారని అందరూ అనుకుంటున్న తరుణంలో అనూహ్యంగా విడపనకల్లు తహశీల్దార్ బండారిఈరమ్మకు ఉరవకొండమండల పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించగా ఆమె ఈనెల21న బాధ్యతలుచేపట్టారు. ఉరవకొండ నియోజక వర్గంలో అధికార పార్టీలోని కీలక నాయకుల మధ్య గ్రూపు రాజకీయాలు నడుస్తుండటం, ప్రతిపక్ష పార్టీ సైతం బలంగా ఉండటంతో ఎక్కడ ఏ చిన్న పొరపాటు చేసినా, ఏ ఒక్కరికి వంతు పాడినా మిగిలిన నాయకులతో తీవ్రస్థాయిలో వ్యతిరేకత చవిచూడాల్సి వస్తుందని, ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతుందన్న భయంతోనే మండలానికి తహశీల్దార్‌గా రావడానికి ఎవరూ ముందుకు రావడంలేదని తెలుస్తోంది. జిల్లా కలెక్టర్ ఉరవకొండ మండలంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఇక్కడ రాజకీయాలను తట్టుకొని రెండు, మూడు నెలలు కాకుండా రెండు, మూడేళ్లు ఏకధాటిగా ప్రజలకు అందుబాటులోవుండి పనిచేయగలిగిన తహశీల్దార్ నియమించాల్సి ఉంది.

## అధికార పార్టీ ఇరువురు వార్డు సభ్యుల మధ్య తారాస్థాయికి విభేదాలు..!

### - ఉప సర్పంచ్ జి.వన్నప్పను సస్పెన్షన్‌కై ప్రతిపాదించే అంశాన్ని అజెండాలో చేర్చిన పంచాయతీ- వార్డు సభ్యుడు పి.నిరంజన్‌గౌడ్ అర్జీ ఇవ్వగానే స్పందించడంపై చెలరేగుతున్న దుమారం- విభేధాలకు పంచాయతీ వేదికైనా అదీష్టానం స్పందించకపోవడంపై అందరిలోనూ విస్మయం- నేడు మేజర్ గ్రామ పంచాయతీలో వాడీ వేడిగా జరుగనున్న సాధారణ సమావేశం



ఉప సర్పంచ్ జి.వన్నప్పను సస్పెండ్ చేయడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపే అంశాన్ని సమావేశం అజెండాలో 12వ అంశంగా చేర్చిన దృశ్యం

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త** : అధికార వైసీపీకు చెందిన ఇరువురు మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నట్లు స్పష్టమౌతోంది. ఒకరేమో ప్రస్తుతం ఉప సర్పంచ్‌గావున్న జి.వన్నప్ప కాగా మరొకరు ఆ పదవిని దక్కించుకోవడానికి శతవిధాలుగా ప్రయత్నిస్తున్న పి.నిరంజన్‌గౌడ్ కావడం విశేషం. ఉప సర్పంచ్ జి.వన్న ప్పను వివిధ కారణాలతో సస్పెండ్ చేయించడానికిగాను ఉన్నతాధికారులకు ప్రతిపాదన లు పంపే అంశంపై పి.నిరంజ న్‌గౌడ్ అర్జీ ఇవ్వగానే ఏకంగా పంచాయతీ సాధారణ సమావే శంలో చర్చించడానికి అజెండా లో చేర్చడంపై దుమారం చెలరేగుతోంది. ఇరువురూ ఒకే పార్టీలో ఉన్నందున ఏవైనా విభేదాలుంటే ఇరువురినీ కూర్చోబెట్టి సామరస్యంగా పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన పార్టీ అధిష్టానం అన్నీ చూస్తూ కూడా స్పందించకపోవడంపై పార్టీ వర్గాలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీను అధికార పార్టీ కైవసం చేసుకున్న తరువాత ఉప సర్పంచ్ పదవికు తీవ్ర పోటీ నెలకొంది. తొలుత వివిధ సామాజిక వర్గాలకు చెందిన వార్డు సభ్యులు పోటీ పడినా చివరికి 5వ వార్డు సభ్యుడు జి.వన్నప్ప, 17వ వార్డు సభ్యుడు పి.నిరంజన్‌గౌడ్ బరిలో నిలిచారు. దీంతో నాడు అదిష్టానం జి.వన్నప్ప వైపే మొగ్గుచూపి అతనికి తొలుత రెండేళ్లు పదవి ఇచ్చి మిగిలిన మూడేళ్ళు పి.నిరంజన్‌గౌడ్‌కు ఇచ్చేలా నిర్ణయించి ఈ మేరకు అగ్రిమెంట్ సైతం రాయించి జి.వన్నప్పకు ఉప సర్పంచ్ పదవిని కట్టబెట్టింది. నాటి నుండి నేటి వరకు వారి మధ్య వివిధ అంశాల్లో అభిప్రాయ బేధాలు కొనసాగుతూనే వస్తున్నాయి. ఈ క్రమంలోనే జి.వన్నప్ప రెండేళ్ల పదవీ కాలం మార్చి 16వ తేదీతో ముగిసిపోగా పి.నిరంజన్‌గౌడ్‌కు ఆ పదవిని కట్టబెట్టే అంశం మరొకమారు తెరమీదకు రాగా పార్టీ వర్గాల నుండే ఆయకు మద్దతు కరువైంది. దీంతో పార్టీ అదిష్టానం ఆ విషయమై ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. అగ్రిమెంట్ గడువు ముగిసి 3 నెలలైనా నేటికీ జి.వన్నప్పే ఉప సర్పంచ్‌గా కొనసాగుతుండగా పంచాయతీలో జరిగే ప్రతి సమావేశంలోనూ, బయట వారి మధ్య అభిప్రాయ బేధాలు సర్వసాధారణ మయ్యాయి. ఏ చిన్న అవకాశం దొరికినా పరస ్పరం నిందించుకోవడానికి కూడా వెనుకాడటంలేదు. అయితే ఉప సర్పంచ్ పదవి ఆశిస్తున్న పి.నిరంజ న్‌గౌడ్‌కు పార్టీలో మద్దతు లేకనే ఆ పదవి దక్కకుండా పోయిందన్న చర్చ కొనసాగుతోంది. దీంతో అవకాశాల కోసం వేచి చూస్తున్న పి.నిరంజన్‌గౌడ్ ఏకంగా జి.వన్నప్ప వార్డు సభ్యత్వానే రద్దు చేయించేందుకు చాకచక్యంగా పంచాయతీలోని కొందరు పెద్దల సహకారంతో వ్యూహం రచించినట్లు పలువురు చర్చించుకొంటున్నారు. ఈక్రమంలోనే పి.నిరంజన్‌గౌడ్ ఇచ్చిన అర్జీ మేరకు పంచాయతీ పాలకవర్గ పెద్దలు, కార్యదర్శి జి.వన్నప్పను సస్పెండ్ చేసే విషయాన్ని ఈనెల 23వ తేదీన శుక్రవారం జరిగే పంచాయతీ సాధారణ సమావేశం అజెండాలో 12వ అంశంగా పొందుపర్చారని అంటున్నారు. 2020-21 సంవత్సరము టెండరు మొత్తం 1,60,000 రూపాయలు గ్రామ పంచాయతీ వారికి బాకీ ఉన్నారని, పంచాయతీ స్థలం అమ్మకానికి సహకరించినందున ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు అయినందున ఉప సర్పంచ్ జి.వన్నప్పను సస్పెండ్ చేయుటకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించడానికి సాధారణ సమావేశంలో చర్చించే అంశాన్ని అజెండాలో పొందు పర్చారు. ఒకే పార్టీకు చెందిన వారిలో ఒకరి మధ్య ఇంకొకరికి ఎన్ని విభేదాలున్నా గతంలో ఎవ్వరూ ఇలాంటి చర్యలకు ఉపక్రమించిన దాఖలాలే లేవని తెలుస్తోంది. పంచాయతీ వేదికగా వార్డు సభ్యులు పోట్లాడుకొంటుంటే పార్టీ అదిష్టానం ఎందుకు నోరు మెదపడంలేదన్న ప్రశ్న తలెత్తుతోంది. పార్టీ అదిష్టానం ఉప సర్పంచ్ జి.వన్నప్పను పొమ్మనకుండా పొగపెట్టించిందా అన్న అనుమానాలను పలువురు ఆ పార్టీ వార్డు సభ్యులే వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో చీమ చిటుక్కుమన్నా అదిష్టానానికి తెలుస్తుందని ఉప సర్పంచ్ వార్డు సభ్యత్వాన్ని రద్దు చేయించేందుకు పావులు కదుపుతుంటే తెలియకుండా ఉంటుందా అని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా ఈరోజు పంచాయతీలో జరిగే సాధారణ సమావేశం వాడీవేడిగా కొనసాగే పరిస్థితులు స్పష్టంగా కనబడుతున్నాయి.

04ATP22_04ATP22.qxd 22-06-2023 PM 10:41 Page 1



## అనంతలో బజాజ్ అలయన్జ్ జనరల్ ఇన్సురెన్స్

అనంతపురం, జూన్ 22 ప్రభాతవార్త బ్యూరో

భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ జనరల్ ఇన్సు రెన్స్‌లో ఒకటైన బజాజ్ అలయన్జ్ జనరల్ ఇన్సు రెన్స్, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో తమ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ కొత్త కార్యాలయం ఏర్పాటు ద్వారా దేశంలోని టైర్-2, టైర్-3 నగరాల్లో ఇన్సూరెన్స్ ప్రాము ఖ్యాన్ని వివరిస్తూ వ్యాపారాన్ని మరింత విస్తరించుకోవాలనే లక్ష్యాన్ని పెట్టుకు ంది. తద్వారా దేశంలో ఇన్సురెన్స్ వ్యాప్తికి ఇది ఎంతగానో ఉపయోగ పడుతు ందని భావిస్తోంది. భారతదేశం ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. దాంతోపాటు ఎప్పటికప్పుడు ప్రమాదం పొంచి ఉండే ఉంటు ంది. దీంతోపాటు ఏ క్షణానికి ఏం జరుగుతుందో తెలీని పరిస్థితి. ఇలాంటి సమయంలో బజాజ్ అలయన్జ్ తన వినూత్నమైన ఉత్తర్వులు, పరి ష్కారాల తో అనంతపురం ప్రజలకు మరింత చేరువ అవ్వాలనే లక్ష్యంగా పెట్టు కుంది. వినియోగదారుల అవసరాలను తీర్చేందుకు సాంకేతిక తతో కూడిన విస్తృత శ్రేణి సేవలను అందిస్తోంది. బజాజ్ అలియాన్జ్ జనరల్ ఇన్సూరెన్స్ కొత్త కార్యాలయం సేవల ద్వారా తన ఉనికిని మరింత బలోపే తం చేయ డానికి, ప్రాంతంలోని తన కస్టమర్లను చేరు కోవడానికి వ్యూహాత్మక కేంద్రంగా పని చేస్తుంది. కొత్త కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా బజాజ్ అలయన్జ్ జనరల్ ఇన్సురెన్స్ జియో డిస్ట్రిబ్యూషన్ హెడ్ శ్రీ రోహిత్ జైన్ మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. ఏదైనా ఊహించని సంఘటనలు జరిగి నప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా ఆదుకోవడంలో బీమా చాలా కీలకం. కానీ, ఇన్సూరెన్స్ యొక్క ప్రాముఖ్యత, ప్రయోజనాల పట్ల చాలా మందికి అవగాహన చాలా తక్కువగా ఉంది. తద్వారా ఇన్సురెన్స్ తీసుకోవడం అనేది చాలా చాలా తక్కువగా ఉంది. వినియోగదారులకు అవసరమైన సమగ్రమైన పరిష్కారాలను అందించే సంస్థ అవ్వడం వల్ల, మేము అన్ని ప్రాంతాల్లో బీ మా అవగాహన పెంచే దుకు వీలైనన్ని ప్రయత్నాలు చేస్తున్నా ము. ఇది మా వినియోగదారులకు ఇన్సురెన్స్ ఉత్పత్తి పరిష్కారాలను, సంబంధిత సేవలను అందజేస్తుంది. అనంతపురంలో మా కొత్త కార్యాల యాన్ని ప్రారం భించడం ద్వారా దేశంలోని ప్రతి ఇంటికి చేరుకోవడం, బీమా అవసరాలను తీర్చడం అనే మా లక్ష్యానికి ఒక అడుగు దగ్గరగా ఉంటుందని అన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన కార్యాలయంలో అన్ని రకాల వ్యాపార ఉ త్పత్తులను అందిస్తారు. అదే సమయంలో వినియోగదారులకు తీసుకున్న భీమా చేయ బడిందని నిర్ధారించుకోవడానికి వారి అవసరాలకు అనుగుణంగా అత్యుత్తమ ఉత్ప త్తులపై అవగాహన కల్పిస్తారు. బజాజ్ అలయన్జ్ జనరల్ ఇన్సూరెన్స్ సమర్ధవంతమైన, విస్తారమైన పంపిణీ మార్గాల ద్వారా దేశంలోని ప్రతి విభాగానికి దాని తాలూకా ఉత్పత్తులు, సంబంధిత సేవలను విస్తరించేందుకు కట్టుబడి ఉంది. తద్వారా సమాజహితానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

## ఫుడ్ ప్రాసెసింగ్ లక్ష్యాన్ని పూర్తి స్థాయిలో చేరుకోవాలి - జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

అనంతపురం,కలెక్టరేట్ జూన్ 22,ప్రభాతవార్త: జిల్లాకు ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటులో కేటాయించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు.గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో కలసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిఎంఎఫ్ఎంఈ కింద 2023-24 ఏడాదికి సంబంధించిన 310 ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చుయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు.ఇందులో ఇప్పటి వరకు 142 యూనిట్లను మాత్రమే గుర్తించడం జరిగిందని,ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల గుర్తింపులో ఎలాంటి పురోగతి లేదని,వెంటనే జిల్లా రిసోర్స్ పర్సన్స్ యూనిట్ల గుర్తింపును చేపట్టాలన్నారు.ఇప్పటి వరకు గుర్తించిన యూనిట్లకు సంబంధించి ప్రాజెక్ట్ రిపోర్టు ను తయారు చేయాలని అనంతరం బ్యాంకులకు సబ్మిట్ చేయాలన్నారు.మరో మూడు వారాల తర్వాత మళ్లీ సమావేశం నిర్వహిస్తామని అన్నారు,అప్పటిలోగా కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను తప్పనిసరిగా గుర్తించాలన్నారు.ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటులో అందించే సబ్సిడి వివరాలను గురించి అవగాహన కల్పించాలన్నారు.జిల్లాకు కేటాయించిన లక్ష్యానికి మించి యూనిట్లు ఏర్పాటు చేసేలా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రఘునాథ్‌రెడ్డి,లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్డీఎం) డి.సత్యరాజు,డిఆర్డిఏ పి.డి.నరసింహారెడ్డి,డిసిఓ ప్రభాకర్‌రెడ్డి,ఫిషరీస్ డిప్యూటీ డైరెక్టర్ శాంతి,పిఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ,పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రమణ్యం,డిపిఓ ప్రభాకర్, డిటిడబ్ల్యూఓ అన్నదొర,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి


నిరసన తెలియజేస్తున్న కార్మికులు


కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్మికులు

అనంతపురం, జూన్ 22 ప్రభాతవార్త

గార్బేజ్ కార్మికులకు ఐదు నెలలుగా బకాయిలు ఉన్న జీతాలు, మలేరియా కార్మికులకు మూడు నెలలుగా బకాయి ఉన్న జీతాలు, కోవిడ్‌కార్మికులకు రెండు నెలలుగా బకాయి ఉన్న జీతాలు, వీరి జీతాలు కోసం మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ ఛాంబర్ ముందర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏటిఎం నాగరాజు ఆధ్వర్యంలోమౌనంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతాధికారులు కార్మికుల సమస్యలపైన పట్టించకపోగా కార్మికులను మభ్యపెట్టే విధంగా మాట్లాడడం జరిగింది. మూడు రోజులు గడువు అడగడం జరిగింది. జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడు తూ.. ప్రజలందరికీ మెరుగైన సేవలందిస్తూ, అనంతపురం మురికినంత శుభ్రం చేస్తూ, మలమూత్రాలు ఎత్తేస్తూ, తమ ప్రాణాలు సైతం లెక్కచే య కుండా మోరీల కింద దూరి పూడికలు కాలువలను శుభ్రం చేస్తూ మున్సి పల్ కార్యాలయమే దేవాలయం అం టూ ప్రజలే దేవుళ్లుగా భావించి పనిచేస్తున్నా మోసం చేయడం సరికా దన్నారు. కమిషనర్ స్పందిస్తూ వీలైనంత త్వరగాజీతాలు అందజేస్తామని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి తిరుమలేష, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మి నారాయణ, కమిటీ సభ్యులు ఎం.ఆది నారాయణ, నాగేంద్ర, చలపతి, కుళ్లాయప్ప, రాఘవేంద్ర, ఎం.నల్లప్ప, రాజు, కార్మికులందరూ పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్ వార్డెన్ల మధ్య అంతర్గత విభేదాలు...!

### ఆదివారం ఓ విషయంలో గొడవ పడిన విద్యార్థినిలు - గురువారం ఉదయం పోలీసు స్టేషన్‌కు వెళ్ళిన ఓ విద్యార్థిని - సమస్య తెలిసినా డీడీ పట్టించుకోకపోవడమే కారణం


విద్యార్థినీలు, వార్డెన్లతో మాట్లాడుతున్న డీడీ ఖుష్బూ కొఠారి, ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

ఇద్దరు వార్డెన్ల మధ్య జరుగుతున్న అంతర్గత విభేదాల వలన విద్యార్థినిల మధ్య గొడవకు దారి తీసింది. ఓ విద్యార్థిని ఏకంగా పోలీసు స్టేషన్‌కు వెళ్ళడం జరిగింది. ఈ సమస్య బీసీ వేల్ఫేర్ డీడీకి ముందుగానే తెలిసిన ప్పటికి ఆమె పరిష్కరం కోసం ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడమే ఇందుకు కారణమని తెలిసింది. అనంతపురం పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి (పెద్దాసుపత్రి) వెనుక ఉన్న అనంతపురం అర్బన్, రూరల్ బీసీ గర్ల్స్ కాలేజ్ హాస్టల్స్.ప్రీ మెట్రిక్ హాస్టల్స్ వున్నాయి. ఇక్కడ వార్డెన్ సుజాత ఒక ప్రీ మెట్రిక్, ఒక పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌కు వార్డెన్‌గా వ్యవహ రిస్తుంది. మరొక వార్డెన్ ఆదిలక్ష్మి పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తుంది. వీరిద్దరు గత ఎడాది జరిగిన బదిలీల్లో ఇక్కడికి రావడం జరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా ఒకే కాంపౌండ్‌లో రెండు హాస్టల్స్ నడుస్తున్నాయి. గత ఎడాది నుంచి ఒక ప్రీ మెట్రిక్ హాస్టల్‌ను కూడా అక్కడే ప్రారంభించారు. ఈ మూడు హాస్టల్స్‌లో దాదాపు 600 మందికి పైగా విద్యార్థినిలున్నాయి. అయితే ఆ ఇద్దరు వార్డెన్లు మధ్య గత కొన్ని నెలలుగా అంతర్గత విభేదాలు నడుస్తున్నాయి. అవి రోజు రోజుకు తీవ్రతరం అవుతు న్నాయి. తాజాగా ఆదివారం అనంతపురం అర్బన్, రూరల్ హాస్టల్లోని ఇద్దరు విద్యార్థినిల మధ్య చిన్న విషయంలో గొడవ జరిగింది. ఈ విషయాన్ని ఓ విద్యార్థిని తన తల్లిదం డ్రులు, బంధువులకు చెప్పడంతో వారంతా బుధవారం రాత్రి హాస్టల్ వద్దకు చేరుకుని తమ అమ్మాయిపైన గొడవకు వచ్చిన మరొక విద్యార్థినితో గొడవ పడేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న ఏబీసీడబ్ల్యూవో సుభాషిణి అక్కడికి చేరుకుని ఓ విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించడానికి ప్రయత్నించారు. అయితే బుధవారం ఉదయమే మరొక విద్యార్థిని హాస్టల్ నుంచి ఎవ్వరికి చెప్పకుండా భయటకు వెళ్ళిపోయింది. ఆ విద్యార్థిని గురువారం ఉదయం అనంతపురం టూటౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్ళింది. అక్కడ పోలీసులు సర్దిచెప్పి హాస్టల్‌కు పంపించారని తెలిసింది. ఆ తర్వాత ఇద్దరు వార్డెన్లను డీడీ తన ఆఫీసుకు పిలిపించుకొని వార్డెన్ల ను మంద లించారు. మూడు హాస్టల్స్‌ను ఖాళీ చేసి మరొక చోటకు తరలిం చడానికి బిల్డింగ్ చూసుకోవాలని ఆదేశిం చారు. అలాగే సాయం త్రం కూడా డీడీ, ఏబీసీడబ్ల్యూవో ఆ హాస్టల్స్‌కు వెళ్ళి జరిగిన గొడవపై ఆరా తీసి విద్యా ర్థులను, వార్డెన్లను మందలించారు. ఒక హాస్టల్‌ను ఇక్కడి నుంచి మరొక చోటకి తరలించడానికి చర్యలు తీసుకుం టామని తెలిపారు. అయితే ఈ ఇద్దరు వార్డెన్ల మధ్య విభేదాలున్నాయన్న విషయం డీడీకి ముందుగానే తెలిసినప్పటికీ తూతూమంత్రంగా సమస్య పరిష్కరం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది. హాస్టల్లో సమస్య వచ్చిన మొదట్లోనే ఒక హాస్టల్‌ను మరొక చోటకు తరలించివుంటే ప్రస్తుతం విద్యార్థినిల మధ్య గొడవ జరిగేది కాదని, ఈ గొడవ స్టేషన్ వరకు వెళ్ళేది కాదని పలువురు వార్డెన్లు అభిప్రా యం వ్యక్తం చేస్తున్నారు. ఒకే చోట రెండు హాస్టల్స్ ఉండకూడదని గతంలో ఇన్‌చార్జ్ డీడీగా పనిచేసిన నాగముని ఉత్తర్వులు కూడా జారీ చేశారు. కానీ ఆ ఉత్తర్వులను అప్పట్లో వార్డెన్లు అమలు చేయలేదు. కనీసం ఇకనైనా డీడీ నిర్లక్ష్యం వీడి హాస్టల్లోని సమ స్యపైన ఎప్పటికప్పుడు స్పందించి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని పలువురు వార్డెన్లు, విద్యార్థులు కోరుతున్నాయి.

## ఆర్.కృష్ణయ్య, జస్టిస్ ఈశ్వరయ్యలకు బిసిలపై దాడులు కనిపించవా..?

### - బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య


మాట్లాడుతున్న టీడీపీ నేతలు

గార్లదిన్నె, జూన్ 22 ప్రభాతవార్త

గార్లదిన్నెలో వైసీపీ అరాచకాలు తాలిబాన్స్‌ను మిచిపోతున్నాయని తెలుగుదేశం పార్టీ బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య తెలిపారు. గురువారం స్థానిక జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బిసి సెల్ ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మినరసిహులు, రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకట నారా యణ, గాండ్ల కార్పోరేషన్ మాజీ చైర్మన్ విశాలాక్షి, శాలివాహన సాధికారిక రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, నగర అధ్యక్షులు సిమెంట్ పోలన్న మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైకాపా నాయకుల అరాచకాలు రోజురోజుకి ఎక్కువవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో తాలిబన్స్ లాగా వైసీపీ అరాచకాలు పెట్రేగిపోతున్నాయని అభివర్ణించారు. ఆర్.కృష్ణయ్య, జస్టిస్ ఈశ్వరయ్యలు బిసిలకు జరుగుతున్న దాడులను ఖండించడం లేదని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న బిసిల కాకుండా, తెలంగాణలో ఉన్న వారికి పదవులు ఇస్తున్న స్థానిక ంగా ఉన్న బిసి మంత్రులు నోరు మెదపకపోవడం ఆక్షేపనీయ మన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య, జస్టిస్ ఈశ్వరయ్యలు తక్షణమే వారి పద వులకు రాజీనామా చేయాలని డి మాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల శాతాన్ని తగ్గించిన వైకాపా ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు తెల పా లని ప్రశ్నించారు. వైకాపా పాల నకు రోజులు దగ్గరపడ్డాయని తెలిపారు. ఈ సమావేశంలో శాలివాహన సాధికార రాష్ట్ర డైరెక్టర్ ఓబుళపతి, కురుబ సాధికార రాష్ట్ర డైరెక్టర్ నారాయణస్వామి, లోలూరు నారాయణస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరిద్దాం

### -మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి


మాట్లాడుతున్న మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

పుట్టపర్తి_టౌన్, జూన్ 22, ప్రభాతవార్త

నాలుగేళ్ళ వైకాపా ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్న ముఖ్యఉద్దేశ్యంతో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బస్సు యాత్రను ప్రతిష్టాత్మంగా చేపడుతున్నారని, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలియజేశారు. గురువారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు పల్లె విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 24న భవిష్యత్తు గ్యారెంటీ బస్సుయాత్ర పుట్టపర్తి నియోజకవర్గంలోని బొ గ్గుల పల్లి నుండి ప్రారంభమౌతుందన్నారు. అక్కడి నుండి నల్లమాడ, వెంగళమ్మచెరువు, పుట్టపర్తి మీదుగా బుక్కపట్నం నుండి కొత్తచెరువుకు బస్సు యాత్ర చేరుకుంటుందన్నారు. సాయంత్రం కొత్తచెరువులోని బహిరంగ సభ ఉంటుందన్నారు. శనివారం రాత్రి పుట్టపర్తిలో బస చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల ముఖ్యనాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నా రన్నారు. నల్లమాడలో టిడిపి హయాం లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఈ బస్సు యాత్రలో ప్రజలకు వివరిస్తామన్నారు. పుట్టపర్తి సమీపంలో కర్ణాటక నాగేపల్లి వద్ద టిడిపి ప్రభుత్వం నిర్మించిన టిట్కో ఇళ్ళను చంద్రబాబు పరిశీలిస్తారన్నారు. అలాగే మహానాడులో ప్రకటించిన మినీ మ్యానిఫెస్టో అంశాలను ఈ యాత్రలో వివరిస్తారన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, 18 యేళ్ళు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 పంపిణీ, మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్న యేడాది చదువులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు, ఇంటికో కుళాయి, యేడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, బిసి వర్గాలకు రక్షణ, తదితర పథ కాలను ఈ యాత్రలో వివరించడం జరుగుతుందన్నారు. ఈ బస్సు యాత్ర లో టిడిపి శ్రేణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చా రు. ఈ కార్యక్రమంలో నాయకులు సామకోటి ఆదినారాయణ, మున్సిపల్ కోర్ లీడర్ రత్నప్పచౌదరి, రూరల్ కన్వీనర్ విజయ్‌కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఆఫీసు ఎదుట రెండవ రోజు నిరసన కార్యక్రమం


కెజిబివి ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఈఓ ఎం.సాయిరామ్

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

కెజిబివి విద్యాలయాల్లో పని చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్న వారిని యదావిధిగా కొనసాగించాలని వారిని వెంటనే రెన్యూవల్ చేయాలి, ప్రస్తుతం నిర్వహిస్తున్న వెరిఫి కేషన్‌ను ఆపాలని సిఐటియు ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఆఫీసు ఎదుట నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నటువంటి గెస్ట్ ఫ్యాకల్టీకి సర్వీసింగ్ బట్టి పాయింట్స్ ఇస్తామని చెప్పారు. అవి ఏవి పరిగణలోకి తీసుకోకుండా కొత్త నోటిఫికేషన్ ఇచ్చి అన్ని పోస్టులు ఖాళీలు చూపించి నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్న వారికి అన్యాయం చేస్తున్నారు. ఇక్కడికి వచ్చిన డీఈఓ ఉద్యోగులకు సరైన సమాధానం చెప్పకుండా ఉద్యోగులను కించపరిచే విధంగా మాట్లా డారు. మహిళల పట్ల అంత దురుసుగా మాట్లాడడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులతోపాటు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజినేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, రజిత తదితరులు పాల్గొన్నారు.

## ఇంతకు ముందున్న ఉపాధ్యాయులను అలాగే కొనసాగించాలి


నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

కెజిబివి విద్యా సంస్థలలో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న 256 మంది ఉపాధ్యాయులను తొలగించడం అన్యాయమని, చాలా సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా చేస్తున్న వారిని విధుల్లోకి తీసుకుని మిగిలిన పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని బాధితులతో కలిసి ఎస్ఎస్ఏ కార్యాలయం దగ్గర ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు ఇ.కుళ్లాయిస్వామి, జి.చిరంజీవి, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమామహేష్ నాయకులు వంశీ నరసిహా యాదవ్, రఘు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడేషన్ల విషయంలో ఉదారంగా వ్యవహరించండి

### - ప్రభుత్వ విప్ కాపు


పౌర సంబంధాల శాఖ కమిషనర్‌తో కాపు విప్

రాయదుర్గం,జూన్ 22,ప్రభాతవార్త: విజయవా డలో,రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయ కుమార్‌రెడ్డిని కలసి అక్రిడే షన్లు ఇచ్చే విషయంలో ఉదారంగా ఉండాలని ప్రత్యేకించి చిన్న పత్రికలకు మరియు ఎలక్ట్రానిక్ మీడియా వారికి అందరికి అవకాశం కల్పించాలని కోరిన ప్రభుత్వ విప్,రాయదుర్గం శాసన సభ్యులు కాపు రామచంద్రారెడ్డి కోరారు. అందుకు సానుకూలంగా స్పందించి అధికారులకు తగిన ఆదేశాలు వెంటనే ఇస్తామని హామీ ఇచ్చిన ఇన్ఫర్మేషన్ కమిషనర్.

## మాతృ, శిశు మరణాలు జరగరాదు

### - మరణాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి - జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

అనంతపురం, జూన్ 22 ప్రభాతవార్త బ్యూరో

జిల్లాలో మాతృ, శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో జనవరి -ఏప్రిల్ నెలల్లో జరిగిన మాతృ, శిశు మరణాలపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ నెలవరకు జిల్లాలో 2 మాతృ మరణాలు, 2 శిశు మరణాలు సంభవించాయన్నారు. మాతృ మరణాల్లో ప్రోటోకాల్ ఫాలో అయ్యారా లేదా అనేది విచారించి పూర్తిస్థాయి రిపోర్టు అందించాలని డిఎంహెచ్ఓని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తున్న హై రిస్క్ గర్భవతులను పరీక్షించి వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఒక మరణం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ఓ వీరబ్బాయి, డిఐఓ యుగంధర్, డిసిహెచ్ఎస్ డా.కృష్ణవేణి, 108 డిఎం సంజీవరెడ్డి, డిఎస్ఓ సుజాత, ఎస్ఓ మారుతీ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు సంక్షేమ పథకాలు మరింత చేరువ


జగనన్న సురక్ష గురించి వివరిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, జూన్ 22 ప్రభాతవార్త:

జగనన్న సురక్ష పథకంతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ కావడం జరుగుతుందని జెసిఎస్ కన్వీనర్ మఠం శ్యాం సుందర్ శాస్త్రీ,అక్కంపల్లి సర్పంచ్ మల్లెల వడ్డే పుష్పావతి లింగమయ్య తెలిపారు.జగనన్న సురక్ష కార్యక్రమంపై జెసిఎస్ మండల కన్వీనర్ మఠం శ్యాంసుందర్ శాస్త్రీ అనంత రూరల్ మండలం అక్కంపల్లి సచివాలయంలో సర్పంచ్ మల్లెల వడ్డే పుష్పావతి లింగమయ్య అధ్యక్షతన గురువారం సచివాలయ కన్వీనర్లుకు, గృహ సారధులకు, వలంటర్లీకు శిక్షణ తరగతులు నిర్వహించి జగనన్న సురక్ష పథకం వలన ప్రజలకు ఎటువంటీ ప్రయోజనాలు కలుగుతాయో తెలియజేశారు. ఈ పథకంతో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మరింత చేరువ కావడం జరుగుతుందని కావున ఈ పథకం గురించి ప్రజలం దరికి తెలపాలన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సార ధులు, పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ, వలంటర్లీ తదితరులు పాల్గొన్నారు.

## మొఘల్ షిమా సాలెహానుసత్కరించిన మేయర్ వసీం


మొఘల్ షిమా సాలెహానుసత్కరిస్తున్న మేయర్ వసీం

అనంతపురం, జూన్ 22 ప్రభాతవార్త

.డీసెట్ ఉర్దూలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన నగరానికి చెందిన మొగల్ షిమా సాలెహాను నగర మేయర్ మహ్మద్ వసీం అభినందించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో గురువారం మొగల్ షిమా సాలెహాను మేయర్ వసీం సత్కరించి అభినందించారు. నగరానికి చెందిన మొఘల్ షిమా సాలెహా సామాన్య కుటుం బానికి చెందినా తల్లిదండ్రులు గర్వించేలా డీసెట్ ఉర్దూలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇదే స్ఫూర్తితో భవి ష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు సైఫుల్లా బేగ్, అనిల్ కుమార్‌రెడ్డి, లీలావతి, కమల్ భూషణ్, వైసీపీ నాయకులు ఖాజా, షేక్షావలి, దాదు, దాదాఖలందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన బాలికల హాస్టల్‌లో మగవారికి బాధ్యతలు ఇవ్వరాదు

### - తొలగించకపోతే పరిణామాలు వేరు : సాకే హరి


అధికారితో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

గిరిజన బాలికల వసతి గృహాల్లో మగవారికి ప్రిన్సిపాల్‌గా ఎలా నియమిస్తారని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి ప్రశ్నించారు. గురువారం దామోదరం సంజీవయ్య భవన్‌లోని గిరిజన సాంఘీక సంక్షేమ శాఖ కార్యాలయంలో ముందు జెఏసి ఆధ్వర్యంలో గిరిజన బాలికల వసతి గృహాల్లో నియమించిన మగవారైన ప్రిన్సిపాల్స్‌ను వెంటనే తొలగించాలని ధర్నా చేప ట్టారు. అనంతరం జిల్లా గిరిజన శాఖ అధికారి అన్నదొరని తొలగించకపోతే పరిణామాలు వేరుగా ఉంటాయని మండిపడుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాకే హరి, కావేటి ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. జిల్లాలో 9 గిరిజన బాలికల గురుకుల వసతి గృహాలున్నాయని వాటిలో నాలుగు చోట్ల అనంతపురం, గోరంట్ల, పెనుకొండ, కదిరిలో మగవారిని ప్రిన్సిపాల్‌గా నియమించారని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు పాల్యా గణేష్‌నాయక్, చాబాల సురేష్, రేకలకుంట రామాంజి నేయులు, రామకృష్ణ, ప్రతాప్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే ప్రక్రియకు రైతులందరూ సహకరించండి

### - తహశీల్దారు ఉషారాణి


మాట్లాడుతున్న తహశీల్దారు ఉషారాణి

గార్లదిన్నె, జూన్ 22 ప్రభాతవార్త

జగనన్న శాశ్వత భూ హక్కు, బూ రక్ష పథకంలో భాగంగా ఇల్లూరు గ్రామంలో గ్రామ సభ తహశీల్దారు ఉషారాణి నిర్వహించారు. నేటి నుంచి ఇల్లూరు గ్రామంలో రి సర్వే ప్రక్రియ ప్రారంభం అవుతుందని, కావున రైతులు, పట్టాదారులు అందరూ అధికారులకు సహకరించాలని తెలియజేశారు. సర్వేకు హాజరైనప్పుడు వారి భూమిని సంబంధించిన అన్ని ఆధారాలు, సిబ్బందికి అందజేయాలని, రీ సర్వే తదుపరి ప్రతి ఒక్కరికి ఎల్‌పిఎం ఆధారిత మాప్, భూ హక్కు పత్రాలు మంజూరు చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్క రైతుకు ప్రభుత్వం ఉచితంగా సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తుందని తెలియజేశారు. సర్వే జరుగు సమయంలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌కి అప్పీల్ చేసుకోనుటకు అవకాశం కలదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు, ఉపసర్పంచు, మండల సర్వేయర్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు సచివాలయ అధికారులు, గ్రామ పెద్దలు, పట్టాదారులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష పథకం గురించి ప్రజలందరికి వివరించాలి


జగనన్న సురక్ష గురించి వివరిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, జూన్ 22 ప్రభాతవార్త:

జగనన్న సురక్ష పథకం గురించి ప్రజలందరికి వివరిం చాలని జెసిఎస్ కన్వీనర్ మఠం శ్యాం సుందర్ శాస్త్రీ, కక్కలపల్లి కాలనీ ఎంపిటిసి 2 వడ్డే శ్రీనివా సులు, సర్పంచ్ తేజశ్వణీ తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై జెసిఎస్ మండల కన్వీనర్ మఠం శ్యాంసుందర్ శాస్త్రీ అనంత రూర ల్ మండలం కక్కలపల్లి కాలనీ సచివాలయంలో ఎంపిటిసి 2 వడ్డే శ్రీనివాసులు,సర్పంచ్ తేజశ్వణీ అధ్యక్ష తన గురువారం సచివాలయ కన్వీనర్లుకు, గృహ సారధులకు,వలంటర్లీకు శిక్షణ తరగతులు నిర్వహించి జగనన్న సురక్ష పథకం వలన ప్రజలకు ఎటు వంటీ ప్రయోజనాలు కలుగుతాయో తెలియజేశారు. ఈ పథకంతో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మరింత చేరువ కావడం జరుగుతుందని కావున ఈ పథకం గురించి ప్రజలందరికి తెలపాలన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీ నర్లు ,గృహసారధులు,వలంటర్లీ తదితరులు పాల్గొన్నారు.

## శంకరమ్మ మృతదేహానికి నివాళులర్పించిన టీడీపీ నేతలు


శంకరమ్మ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

శింగనమల, జూన్ 22 ప్రభాతవార్త

మండల పరిధిలోని నాగలగుడ్డం తాండా గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ డీలర్ శీనానాయక్ మాతృమూర్తి శంకరమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, వారి నివాసానికి వెళ్లి శంకరమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ డీలర్ శీనానాయక్‌ను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఫోన్‌లో మాట్లాడుతూ.. ధైర్యంగా ఉండాలని, మీ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. నివాళులు అర్పించిన వారిలో టీడీపీ నేతలు దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, శింగనమల నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, దండు సతీష్, ప్రసాద్‌నాయక్, నరసింహ నాయక్, నగేష్‌నాయక్, గోపాల్‌నాయక్, సోము, ఆది తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షపై గృహ సారధులకు,వలంటర్లీకు అవగాహన సదస్సు


జగనన్న సురక్షపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్, జూన్ 22 ప్రభాతవార్త:

జగనన్న సురక్ష కార్యక్రమంపై జెసిఎస్ మండల కన్వీనర్ మఠం శ్యాంసుందర్ శాస్త్రీ అనంత రూరల్ మండలం రాచానపల్లి సచివాలయంలో సర్పంచ్ అంజినేయులు యాదవ్ అధ్యక్ష తన గురువారం గృహ సారధుల కు, వలంటర్లీకు శిక్షణ తరగతులు నిర్వహించి జగనన్న సురక్ష పథకం వలన ప్రజలకు ఎటు వంటీ ప్రయోజ నాలు కలుగుతాయో తెలియజేశారు. ఈ పథకంతో ప్రజలకు ప్రభుత్వం అంది స్తున్న సంక్షేమ పథకాలు మరింత చేరువ కావడం జరుగుతుందని కావున ఈ పథకం గురించి ప్రజలందరికి తెలపాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గౌస్,సచివాలయ కన్వీనర్లు ఉట్టీ బాలకృష్ణ,రాకెట్ల రామాంజి నేయులు, నాయకులు పూజారి రామ్మోహన్,లాల్‌స్వామి,పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ,వలంటర్లీ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోజనాలు కలుగుతాయో తెలియజేశారు. ఈ పథకంతో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మరింత చేరువ కావడం జరుగుతుందని కావున ఈ పథకం గురించి ప్రజలందరికి తెలపాలన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీ నర్లు ,గృహసారధులు,వలంటర్లీ తదితరులు పాల్గొన్నారు.